తెలుగు దినపత్రిక
RNI TG TEL/ 26/A0381
# సిరి
People's Voice
వార్త పత్రిక
17-06-2026
బుధవారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 129
PUBLISHED FROM HYDERABAD
పేజీలు-8 వెల:రూ.4 /–

తెలుగు దినపత్రిక
www.siridaily.com
సిరి
People's Voice
వార్తపత్రిక
RNI:TGTEL/26/A0381
siridailynews@gmail.com
/siridailynews
@siridailynews
epaper.siridaily.com

**విలేకరులు కావలెను**

ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.

99897 78881, 7702344303, 9440451575

## నిలిచిన 'వాహన్ సారథి' సేవలు

- రెండు రోజులుగా తెలంగాణ వ్యాప్తంగా ఇదే పరిస్థితి
- రవాణా శాఖ కార్యాలయంలో భారీ క్యూ లైన్లు
- చేతులెత్తేస్తున్న రవాణా శాఖ అధికారులు
- వాగ్వాదానికి దిగుతున్న వాహనదారులు

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:**

తెలంగాణలో రెండు రోజులుగా రవాణా సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. రవాణా సేవలు అందించే వాహన్ సారథి సాఫ్ట్‌వేర్ పనిచేయకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా రవాణా శాఖ కార్యాలయాల్లో

మిగతా 2వ పేజీలో..





# వాక్ అలాంగ్ ది లైన్!

- విద్యుత్ శాఖలో సరికొత్త కార్యక్రమం
- లైన్ స్థితిగతులపై పోల్ టు పోల్ సర్వే
- లోపాలపై వెనువెంటనే చర్య
- నిత్యం క్షేత్ర స్థాయిలోనే అధికారులు, సిబ్బంది
- రెప్పపాటు అంతరాయం ఉండొద్దన్నదే లక్ష్యం
- ఆనంద్ బాగ్ లో సిబ్బందితో కలిసి నడిచిన టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి పాటిల్

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్**

రెప్పపాటు కరంటు పోకుండా వినియోగదారులకు సేవలందించడమే తమ లక్ష్యమని టీజీఎస్పి డీసీఎల్ సీఎండీ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. ప్రజల సమస్య ఉన్నచోటే సిబ్బంది ఉండాలన్న లక్ష్యంతో 'పోల్స్ అండ్ లైన్స్ స్పెషల్ డ్రైవ్'కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా మంగళవారం 'వాక్ అలోంగ్ ది లైన్' కార్యక్రమాన్ని గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఖైరతాబాద్ సర్కిల్ పరిధిలోని ఆనందబాగ్ లో క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా వర్షాకాల సన్నద్ధతలో

మిగతా 2వ పేజీలో..



## గోల్డ్ మెడల్ సాధించిన 'పసుపులేటి' మనవరాళ్లు

- పికిల్ బాల్ లో అక్కాచెల్లెళ్ల ప్రతిభ
- అభినందించిన మాజీ ప్రజా ప్రతినిధులు

2



## అక్రిడిటేషన్ కార్డుల చెల్లుబాటు గడువు పెంపు

- నెలరోజుల పాటు పొడిగింపు
- ఆదేశాలు జారీచేసిన హైకోర్ట్
- జర్నలిస్టులకు తాత్కాలిక ఊరట

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:**

తెలంగాణ రాష్ట్రంలోని జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల చెల్లుబాటును 2026 జూలై 15 వరకు తెలంగాణ హైకోర్టు పొడిగించింది. అక్రిడిటేషన్ కార్డులకు సంబంధించిన జీఓ ఎం.ఎస్. నెం. 252, దాని సవరణలను సవాల్ చేస్తూ దాఖలైన

మిగతా 2వ పేజీలో..



## ఏసీబీ వలలో మరో అవినీతి తిమింగలం

- ల్యాండ్స్ అండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్‌కు రూ.200 కోట్ల ఆస్తులు
- మంచం కింద కోటి రూపాయలు
- కిలో బంగారం.. కిలోల కొద్దీ వెండి సైతం
- ఖాళీ సంతకాలతో బాండ్ పేపర్లు.. ఆస్తుల పత్రాలు

2

## ఏఐ, యాప్‌లతో వ్యవసాయ ఆధునీకరణ

- రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు
- విత్తనం నుంచి కొనుగోలు వరకు పర్యవేక్షణ
- ఏఐ, యాప్‌లతో వ్యవసాయ ఆధునీకరణ
- వ్యవసాయానికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక: సీఎం రేవంత్ రెడ్డి

2





## బీజేపీకి తొత్తుగా ఈసీ..

- ఎస్ఐఆర్ పేరుతో ఓట్ల గల్లంతు కుట్ర
- తమకు పడవనుకున్న ఓట్లను ఏరికోరి తొలగిస్తున్నారు
- బీజేపీ చెప్పినట్లే పవన్ కళ్యాణ్ ఆడుతున్నాడు
- మూసీ ప్రక్షాళనకు నిధులేవీ?
- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్
- సంగారెడ్డిలో కాంగ్రెస్ బూత్ లెవెల్ ఏజెంట్ల సమావేశం

**సంగారెడ్డి, సిరి న్యూస్:**

కేంద్ర ఎన్నికల సంఘం పూర్తిగా బీజేపీకి తొత్తుగా మారిందని, మతతత్వ పార్టీలకు ప్రయోజనం చేకూరేలా ఓట్ల సవరణ ప్రక్రియ పేరిట ప్రతిపక్షాల ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్

మిగతా 2వ పేజీలో..



## ఉద్యోగ ఒత్తిడి తట్టుకోలేక యువతి ఆత్మహత్య

- వరంగల్ లో విషాదం

**వరంగల్, సిరి న్యూస్:**

వరంగల్ నగరంలోని కాశీబుగ్గ ప్రాంతంలో విషాద ఘటన చోటుచేసుకుంది. కాశీబుగ్గ

మిగతా 2వ పేజీలో..



## స్విట్జర్లాండ్‌లో ఒప్పందానికి సంతకాలు

- శాంతి చర్చల్లో ఆసక్తికర వ్యూహం
- ట్రంప్ ప్రవర్తనపై ప్రత్యేక అధ్యయనం
- స్విట్జర్లాండ్‌లో ఒప్పందానికి సంతకాలు
- ట్రంప్‌ను అర్థం చేసుకునేందుకు సైకాలజిస్టుల సాయం తీసుకున్న ఇరాన్?

**తెహ్రాన్/వాషింగ్టన్, జూన్ 16:**

పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధానికి ముగింపు పలకడానికి జరిగిన శాంతి చర్చల సందర్భంగా ఇరాన్ అనుసరించిన వ్యూహంపై ఆసక్తికర అంశాలు వెలుగులోకి వచ్చాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యవహారశైలిని అర్థం చేసుకోవడానికి, ఆయన స్పందనలను ముందుగానే అంచనా వేయడానికి

మిగతా 2వ పేజీలో..

## ఓటు హక్కు రక్షణే ధ్యేయంగా పనిచేయాలి

- ఓటర్ల జాబితాపై బీఎల్‌ఏలు అప్రమత్తంగా ఉండాలి: భట్టి
- అర్హులైన ఒక్క ఓటు కూడా తొలగిపోకుండా చర్యలు
- SSR ప్రక్రియపై బూత్ లెవెల్ ఏజెంట్లకు పూర్తి అవగాహన అవసరం
- ధ్రువీకరణ పత్రాలు సకాలంలో సమర్పించాలని సూచన

2





## పంట బోనస్ కోతపై హరీశ్‌రావు ధ్వజం

- రైతు భరోసా హామీల వైఫల్యం
- నష్టపోయిన ప్రత్యామ్నాయ రైతులు

**హైదరాబాద్, జూన్ 16:**

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పంట బోనస్ నుంచి ప్రభుత్వం తప్పించుకునేందుకు సన్న రకాల సంఖ్యను తగ్గించడం సిగ్గుచేటు అని మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. బోనస్ ఎగవేత, రైతన్నకు

మిగతా 2వ పేజీలో..

# పంట బోనస్ కోతపై హరీశ్‌రావు ధ్వజం

**మొదటిపేజీ తరువాయి**

వాతలు పెట్టేందుకే వ్యవసాయ శాఖ సమీక్ష నిర్వహించినట్లు ఉందని ఎద్దేవా చేశారు. మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంటూ ఏ రకం ధాన్యం వేయాలని సర్కారు నిర్ణయించడం అంటే రైతన్న మెడపై ప్రభుత్వం కత్తి పెట్టడమేనన్నారు. మేనిఫెస్టోలో అన్ని రకాల పంటలకు రూ. 500 బోనస్ అని తర్వాత 33 రకాల సన్నాలకు పరిమితం చేసి ప్రస్తుతం ఏడు రకాలకు తగ్గించారని మండిపడ్డారు. గత మూడు సీజన్లకు రైతు భరోసా ఎగ్గొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం గత యాసంగికి రెండు ఎకరాలకు రైతు భరోసా ఇచ్చి చేతులు దులుపుకుంది. 45 రోజుల్లో ఇస్తామని సిద్దిపేట వేదికగా సీఎం చెప్పి 85 రోజులు దాటింది. ముఖ్యమంత్రి ఇచ్చిన మాటకే దిక్కులేకుండా పోయింది. మాటలు కోటలు దాటితే సీఎం చేతలు గడప దాటదు అనడానికి ఇది మరో ఉదాహరణ అన్నారు. పంట మార్పిడి అంటూ గొప్పలు చెబుతున్న రేవంత్ రెడ్డి మాటలు నమ్మి గత సీజన్లో మొక్కజొన్న, జొన్న, పొద్దు తిరుగుడు, సోయా, వేరుశనగ సాగు చేసిన రైతుల పరిస్థితి రోడ్డు పాలైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎరువుల సరఫరా చేయలేక యాప్ తెచ్చిన ప్రభుత్వం అందులోనూ విఫలం అయింది. సీజన్ కు ఒకరకంగా వ్యవహరిస్తూ రైతులను ఎందుకు గందరగోళం చేస్తున్నారని నిలదీశారు. కరువు ఉందని చెబుతున్న ప్రభుత్వం పంటల బీమా పథకం గురించి ఎందుకు మాట్లాడటం లేదన్నారు.

# గోల్డ్ మెడల్ సాధించిన 'పసుపులేటి' మనవరాళ్లు

**నల్లగొండ, సిరి న్యూస్ :**

నల్లగొండ జిల్లా నిడమనూరు మండలానికి చెందిన మాజీ జడ్పీటీసీ పసుపులేటి మంగ, మాజీ సింగిల్ విండో చైర్మన్ పసుపులేటి సైదయ్యా నాయుడు మనుమరాండ్లు ఇద్దరూ జాతీయ స్థాయి పికిల్ బాల్ లో గోల్డ్ మెడల్స్ సాధించడం విశేషం. అక్క తోట నిహిత మాన్వీ అండర్ 14 విభాగంలో, చెల్లెలు తోట నీహా అండర్ 12 విభాగంలో గోల్డ్ మెడల్ సాధించడంతో పాటు అండర్ 16 విభాగంలో ఇద్దరి జోడీ గోల్డ్ మెడల్ సాధించి ఔరా అనిపించారు. హైదరాబాద్ లో ఈ నెల 13, 14 తేదీల్లో సౌత్ జోన్ పికిల్ బాల్ టోర్నీ నిర్వహించారు. 202425 సంవత్సరాల్లో నిర్వహించిన పికిల్ బాల్ రాష్ట్ర స్థాయి పోటీల్లో సైతం కాంస్యం, రజతం, గోల్డ్ మెడల్స్ సాధించారు. వారు పోటీలో పాల్గొంటే మెడల్ కచ్చితంగా గెలుచుకుని రావడం పరిపాటి. తమ కూతురు ఇద్దరు కూతుర్లు పికిల్ బాల్ లో గోల్డ్ మెడల్స్ సాధిస్తూ ఎదుగుతుండడం పట్ల అమ్మమ్మ, తాతయ్య పసుపులేటి మంగ, పసుపు లేటి సైదయ్యానాయుడు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మెడల్స్ తీసుకుని వచ్చిన ఇద్దర్ని వారు అభినందించి, ఆశీర్వదించారు. దేశానికి ప్రతిద్యం వహించాలని వారు మనుమరాండ్లకు సూచించారు.

# వాక్ అలాంగ్ ది లైన్!

**మొదటిపేజీ తరువాయి**

భాగంగా చేపట్టిన 'పోల్స్ అండ్ లైన్స్ స్పెషల్ డ్రైవ్ వాక్ అలాంగ్ ది లైన్' కార్యక్రమంలో అధికారురులు సిబ్బంది పాల్గొంటారని ఆయన తెలిపారు. విద్యుత్ సరఫరాకు సంబందించిన లైన్లలో సాంకేతిక లోపాలను సరిదిద్దే దిశగా లైన్ల నుండి పర్యటించాలని అయన సూచించారు. వర్షాకాలం ఆరంభానికి ముందే, చెట్లకొమ్మల నరికివేత, విరిగిన స్తంభాల పరిస్థితిని తెలుసుకొని స్తంభాలను మార్చాలన్నారు. ఈ సందర్భంగా సీఎండీ ఉదయం 9:30 గంటల నుండి 11:00 గంటల వరకు విద్యుత్ పంపిణీ నెట్‌వర్క్‌ను లైన్‌టులైన్ సర్వే ద్వారా పరిశీలించి, విద్యుత్ లైన్లు, విద్యుత్ స్థంభాలు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, జంపర్లు, సర్వీస్ కనెక్షన్లు మరియు ఇతర విద్యుత్ మౌలిక సదుపాయాల పరిస్థితిని సమగ్రంగా సమీక్షించారు. తనిఖీల సందర్భంగా గుర్తించిన నెట్‌వర్క్ లోపాలు, పెండింగ్ రెక్టిఫికేషన్ పనులు, లైన్ క్లియరెన్స్ సమస్యలు, దెబ్బతిన్న విద్యుత్ స్థంభాలు మరియు విద్యుత్ సరఫరా నాణ్యతపై ప్రభావం చూపే అంశాలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ సిబ్బంది ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి వినియోగదారుల ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని సూచించారు. అలాగే ఫీల్డ్ సిబ్బంది నిర్దేశిత డ్రెస్ కోడ్ పాటిస్తూ, వ్యక్తిగత భద్రతా పరికరాలు, లైన్ టూల్స్, ఇతర భద్రతా ఉపకరణాలను తప్పనిసరిగా వినియోగించాలని ఆదేశించారు. వర్షాకాలంలో విద్యుత్ అంతరాయాలు తగ్గించేందుకు ఫీడర్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, ఎల్.టి./హెచ్.టి. నెట్‌వర్క్‌ల నిర్వహణ పనులను వేగవంతం చేయాలని, చెట్ల కొమ్మల కత్తిరింపు, లైన్ క్లియరెన్స్ మరియు నివారణ నిర్వహణ చర్యలను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు.

# నిలిచిన 'వాహన్ సారథి' సేవలు

**మొదటిపేజీ తరువాయి**

ప్రజలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొన్నారు. రెండు రోజులుగా ఇదే పరిస్థితి నెలకొనడంతో ప్రజలు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. హైదరాబాద్ నగరంతో పాటు వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్‌లతో పాటు అన్ని రవాణా శాఖ కార్యాలయాల్లో వందల సంఖ్యలో ప్రజలు గుమిగూడారు. సాయంత్రం వరకు అదే పరిస్థితి కొనసాగడం, అధికారులు కనీసం సమాధానం చెప్పకపోవడంతో కొన్ని చోట్ల రవాణా శాఖ అధికారులతో ప్రజలు వాగ్వాదానికి దిగారు. వెంటనే సాఫ్ట్‌వేర్ సవరించి రిజిస్ట్రేషన్లు చేపట్టాలని వాహనదారులు కోరారు. మరోవైపు వివిధ కారణాల వల్ల అధికారులు సీజ్ చేసిన వాహనాల యజమానులకు ఫైన్ కడదామన్నా కట్టలేని పరిస్థితి ఏర్పడింది. ఇక గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయ పనులు ముమ్మరంగా ఉండే ప్రస్తుత పరిస్థితుల్లో ట్రాక్టర్లు, ఇతర ట్రాలీ వాహనాలు సీజ్ చేయడంతో, అవి రిలీజ్ కావాలంటే యాప్ పనిచేయక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. రెండో శనివారం సెలవు, ఆపై సోమవారం నుండి సాఫ్ట్‌వేర్ పనిచేయకపోవడంతో నాలుగు రోజులుగా పనులన్నీ ఆగిపోయాయని వాహనదారులు వాపోతున్నారు. ఏదోరకంగా ఈరోజు సమస్య పరిష్కారం చేయాలంటూ అధికారులను నిలదీస్తే.. 'అది సాఫ్ట్‌వేర్ లోపం, మేమేం చేయగలం' అంటూ రవాణా శాఖ అధికారులు నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్త వాహనాల రిజిస్ట్రేషన్లు, పాత వాహనాల జరిమానాల చెల్లింపులు నిలిచిపోవడంతో.. అవసరానికి వాహనాలు అందుబాటులో లేక యజమానులు ఇబ్బంది పడ్డారు. ఇదే పరిస్థితి ముందుకు సాగితే రవాణా శాఖ సేవలు అందక ఎందరో నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొంది. రెండు రోజులుగా ఇదే పరిస్థితి నెలకొన్నా ఇటు అధికారులు కానీ, అటు ప్రభుత్వం కానీ సమస్య పరిష్కారానికి చొరవ చూపడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

# ఓటు హక్కు రక్షణే ధ్యేయంగా పనిచేయాలి

**హైదరాబాద్, జూన్ 16 సిరి న్యూస్:**

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కును కల్పించడంతో పాటు దానిని సంరక్షించడమే ధ్యేయంగా పనిచేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. 'సర్' (Special Intensive Revision) ప్రక్రియపై బూత్ లెవెల్ ఏజెంట్లకు (BLA) సంపూర్ణ అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. క్షేత్రస్థాయిలో బీఎల్ఏలు అప్రమత్తంగా వ్యవహరించకపోతే పెద్ద ఎత్తున ఓట్లను కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ముఖ్యంగా ఓటర్ల జాబితాలో చోటుచేసుకున్న లోపాలు, తప్పులతో కూడిన 'అనామలస్' (Anomalous) జాబితాలోని ఓటర్ల విషయంలో ఏజెంట్లు అత్యంత జాగ్రత్తగా ఉంటూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.

**అర్హుల ఓట్ల రక్షణే బాధ్యత.. సమయపాలన తప్పనిసరి**

అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు పేరు కూడా ఓటర్ల జాబితా నుంచి తొలగించబడకుండా చూడాల్సిన పూర్తి బాధ్యత బూత్ లెవెల్ ఏజెంట్లపైనే ఉందని డిప్యూటీ సీఎం గుర్తుచేశారు. ఇందుకోసం సదరు ఓటర్లకు సంబంధించిన సరైన ధ్రువీకరణ పత్రాలను (సపోర్టింగ్ డాక్యుమెంట్స్) సేకరించి, వాటిని సకాలంలో ఎన్నికల అధికారులకు సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ బూత్ లెవెల్ అధికారుల (BLO) షెడ్యూల్‌కు అనుగుణంగా బీఎల్ఏలు కచ్చితమైన సమయపాలన పాటించాలని, అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఓటర్ల జాబితాను దోషరహితంగా మార్చడంలో కీలక పాత్ర పోషించాలని ఆయన ఆదేశించారు.

# ఏసీబీ వలలో మరో అవినీతి తిమింగలం

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:**


తెలంగాణాలో అవినీతి శాఖ అధికారులకు మరో భారీ అవినీతి తిమింగలం పట్టుబడింది. అధికారులు జరిపిన సోదాల్లో ల్యాండ్స్ అండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ సుంకరి నరహరికి రూ.200 కోట్ల ఆస్తులు ఉన్నట్లు వెల్లడైంది. ఆయన ఇంట్లో, ఆఫీస్, బంధువుల ఇళ్లు కలిపి 11 ప్రాంతాల్లో ఒకేసారి దాడులు నిర్వహించిన ఏసీబీ అధికారులకు కళ్లు చెదిరిపోయేలా డబ్బు, బంగారం, ఆస్తి పత్రాలు లభించాయి. ఆయన బెడ్ కింద ఏకంగా రూ.1.10 కోట్ల డబ్బును ఏసీబీ అధికారులు పట్టుకున్నా తెలంగాణ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు.. గత కొన్ని నెలలుగా అవినీతి అధికారులపై ఉక్కుపాదం మోపుతున్నారు. ప్రజల నుంచి లంచాల రూపంలో తీసుకుని కూడబెట్టిన రూ. వందల కోట్లను పట్టుకుంటున్నారు. పక్కా సమాచారంతో అవినీతి అధికారుల చిట్టా సేకరించి.. అదును చూసి.. ఏకకాలంలో చాలా ప్రాంతాల్లో సోదాలు నిర్వహించి.. వారి అవినీతి బాగోతాన్ని బయటపెడుతున్నారు. ఇటీవల పెద్ద పెద్ద స్థాయిల్లో ఉన్న ప్రభుత్వ అధికారులు.. రూ.వందల కోట్ల అక్రమాస్తులతో ఏసీబీ అధికారులకు పట్టుబడగా.. తాజాగా మరో అవినీతి తిమింగలం చిక్కింది.

**రూ.200 కోట్ల ఆస్తులు..**

హైదరాబాద్ ఓల్డ్‌సిటీలో నివసిస్తున్న ల్యాండ్స్ అండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ సుంకరి నరహరి.. ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారని సుంకరి నరహరిపై వచ్చిన ఆరోపణలతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులకు భారీ మొత్తంలో నగలు, నగదు, ఆస్తులకు సంబంధించిన పత్రాలు లభించాయి. ఇవాళ ఉదయం నుంచి సుంకరి నరహరి ఇంట్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. హైదరాబాద్ ఛత్రినాకలోని సుంకరి నరహరి ఇంటితోపాటు ఆయన కార్యాలయం.. కుటుంబ సభ్యులు, బంధువుల ఇళ్లు ఇలా మొత్తం 11 ప్రాంతాల్లో ఒకే సమయంలో దాడులు చేశారు. ఈ క్రమంలోనే సుంకరి నరహరి ఇంట్లో.. ఆయన బెడ్రూంలో ఉన్న బెడ్డు కింద రూ.1.10 కోట్ల నగదు ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. ఈ క్రమంలోనే ఆయన ఇంట్లో దొరికిన బంగారు ఆభరణాలు, డబ్బు, రెవెన్యూ రికార్డులను పరిశీలిస్తున్నారు. సుంకరి నరహరితోపాటు.. ఆయన సోదరుడి ఇంట్లో భారీగా ఆస్తిపత్రాలను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్‌లో లగ్జరీ ప్రాంతాల్లో ఓపెన్ ప్లాట్లతోపాటు.. రంగారెడ్డి జిల్లాలో వ్యవసాయ భూమి ఉన్నట్లు అధికారులు విచారణలో వెల్లడైంది. ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ నేతృత్వంలోని స్పెషల్ టీమ్స్ ఈ సోదాలు చేపట్టాయి. ఈ క్రమంలోనే ఇప్పటివరకు దొరికిన ఆధారాల ప్రకారం.. ల్యాండ్స్ అండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ సుంకరి నరహరి ఆస్తులు.. రూ.200 కోట్లకు పైనే ఉంటాయని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

**ఇంకా తెరవని రెండు లాకర్లు..**

ఇదిలావుంటే నరహరి సంబంధించి మరో రెండు లాకర్లు తెరవాల్సి ఉందని ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ తెలిపారు. లాకర్లు తెరిస్తే మరింత విలువైన వస్తువులు దొరకొచ్చని అయన అభిప్రాయపడ్డారు. నిందితుడి కొడుకు ఆస్ట్రేలియా లో ఉంటారని అక్కడే చదివి అక్కడే స్థిరపడ్డారని అయన చెప్పారు. ఐతే ఆస్తుల సంపాదన కు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేవని అయన అన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని నిందితున్ని రిమాండుకు తరలిస్తున్నామని అయన తెలిపారు.



# స్విట్జర్లాండ్‌లో ఒప్పందానికి సంతకాలు

**మొదటిపేజీ తరువాయి**

ఇరాన్ ఇద్దరు సీనియర్ సైకాలజిస్టుల సేవలను వినియోగించినట్లు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఇరాన్ అధికార వర్గాల సమాచారం ప్రకారం, ట్రంప్ నిర్ణయాలు, స్పందనల్లో తరచూ కనిపించే అనూహ్య ధోరణులను దృష్టిలో ఉంచుకుని ఈ చర్య తీసుకున్నట్లు తెలుస్తోంది. శాంతి చర్చల ప్రక్రియలో పంపే సందేశాలు, ప్రతిపాదనలను మరింత సమర్థవంతంగా రూపొందించేందుకు సైకాలజీ నిపుణుల సలహాలు తీసుకున్నట్లు సమాచారం. ముఖ్యంగా చర్చల సమయంలో అమెరికా అధ్యక్షుడి స్పందనలను అంచనా వేసి తదనుగుణంగా వ్యూహాలు రూపొందించేందుకు ఈ బృందం సహకరించినట్లు పేర్కొంటున్నారు. ఇరాన్‌కు చెందిన ఒక అధికారి మాట్లాడుతూ, చర్చల సలహాదారుల బృందంలో ఇద్దరు అనుభవజ్ఞులైన మానసిక నిపుణులను చేర్చామని తెలిపారు. వారి సూచనల ఆధారంగా ట్రంప్‌కు పంపే సందేశాలను రూపొందించామని, ఆ తర్వాత ఆయన స్పందనలో మార్పు కనిపించిందని పేర్కొన్నారు. చర్చల ప్రక్రియ మరింత సానుకూల దిశగా సాగడానికి ఈ విధానం ఉపయోగపడిందని ఆయన అభిప్రాయపడ్డారు.

ఏప్రిల్‌లో జరిగిన తొలి విడత చర్చల అనంతరం ఈ వ్యూహాన్ని అమలు చేయడం ప్రారంభించినట్లు తెలుస్తోంది. భవిష్యత్తులో చర్చలకు సంబంధించిన మరిన్ని వివరాలు బయటకు వచ్చినప్పుడు తమ వ్యూహం ఎంత పకడ్బందీగా అమలైందో ప్రపంచానికి తెలుస్తుందని ఇరాన్ అధికారులు విశ్వాసం వ్యక్తం చేసినట్లు కథనాలు పేర్కొన్నాయి. ఇదిలా ఉండగా, ట్రంప్ ప్రవర్తనపై అమెరికాలో కూడా భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఏడాది ప్రారంభంలో నిర్వహించిన ఒక ప్రజాభిప్రాయ సర్వేలో అమెరికన్లలో గణనీయమైన శాతం మంది ఆయన ప్రవర్తన వయస్సు పెరుగుతున్న కొద్దీ మరింత అనూహ్యంగా మారుతోందని అభిప్రాయపడ్డారు. అయితే ట్రంప్ అనుచరులు మాత్రం ఆయన నిర్ణయాత్మక నాయకత్వమే అమెరికా ప్రయోజనాలను కాపాడుతోందని వాదిస్తున్నారు. 2025 జనవరిలో రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన ట్రంప్, దేశ చరిత్రలో అత్యంత వృద్ధ అధ్యక్షుడిగా రికార్డు సృష్టించారు. బాధ్యతలు స్వీకరించిన తర్వాత వాణిజ్య సుంకాలు, వలస విధానాలు, విదేశాంగ అంశాల్లో పలు కీలక నిర్ణయాలు తీసుకుంటూ అంతర్జాతీయ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారారు. దాదాపు నాలుగు నెలల పాటు సాగిన శాంతి చర్చల అనంతరం అమెరికాఇరాన్ మధ్య తాత్కాలిక ఒప్పందం కుదిరినట్లు సమాచారం. ఈ ఒప్పందంపై స్విట్జర్లాండ్‌లో సంతకాలు జరగనున్నాయని, అమెరికా తరపున ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ఇరాన్ తరపున పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బఘేర్ ఘలీబాఫ్ హాజరవుతారని ఇరాన్ విదేశాంగ శాఖ వర్గాలు వెల్లడించాయి. ఈ ఒప్పందం ప్రాంతీయ శాంతి, స్థిరత్వానికి కొత్త మార్గం చూపుతుందా అన్నది అంతర్జాతీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

# అక్రిడిటేషన్ కార్డుల చెల్లుబాటు గడువు పెంపు

**మొదటిపేజీ తరువాయి**

పిటిషన్లపై విచారణ సందర్భంగా హైకోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ ఉత్తర్వుల చట్టబద్ధతను ప్రశ్నిస్తూ, కేసు విచారణ పూర్తయ్యే వరకు అక్రిడిటేషన్ సదుపాయాలను కొనసాగించాలని వారు కోరారు. పిటిషనర్ల తరఫున న్యాయవాది బర్కత్ అలీఖాన్ వాదనలు వినిపించారు. విచారణ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని స్పెషల్ అడ్వకేట్ జనరల్ కోర్టుకు వివరించారు. ప్రభుత్వ వాదనలు విన్న అనంతరం, ప్రస్తుతం అమలులో ఉన్న అక్రిడిటేషన్ కార్డుల గడువును మరో నెలపాటు పొడిగించాలని హైకోర్టు నిర్ణయించింది. దీంతో ప్రస్తుతం చెల్లుబాటులో ఉన్న అన్ని అక్రిడిటేషన్ కార్డులు 2026 జూలై 15 వరకు కొనసాగుతాయని కోర్టు స్పష్టం చేసింది.

**జర్నలిస్టులకు తాత్కాలిక ఊరట**

హైకోర్టు నిర్ణయంతో తెలంగాణ వ్యాప్తంగా అక్రిడిటేషన్ పొందిన జర్నలిస్టులు అధికారిక కార్యక్రమాలకు అంతరాయం లేకుండా హాజరుకావచ్చు. అలాగే అక్రిడిటేషన్‌కు అనుబంధంగా ఉన్న అన్ని సౌకర్యాలు, ప్రయోజనాలు కూడా కొనసాగుతాయి. దీంతో వారి వృత్తి నిర్వహణలో ఎలాంటి అంతరాయం ఉండదు. ఇదిలా ఉండగా, తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ తరపున అడ్వకేట్ బర్కత్ అలీ ఖాన్ ఒక మధ్యంతర దరఖాస్తు కూడా దాఖలు చేశారు. ఇందులో అక్రిడిటేషన్ కోసం అందిన దరఖాస్తుల సంఖ్య, జారీ చేసిన కార్డుల సంఖ్య, తిరస్కరించిన దరఖాస్తులు మరియు వాటి కారణాల పూర్తి వివరాలను కోర్టు ముందు ఉంచాలని ప్రభుత్వాన్ని ఆదేశించాలంటూ కోరారు. ఈ అంశంపై తదుపరి విచారణలో కోర్టు పరిశీలించనుంది. ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి గౌస్ మొహినొద్దీన్ హైకోర్టు నిర్ణయాన్ని స్వాగతించారు. అయితే ఇది తాత్కాలిక ఉపశమనం మాత్రమేనని, శాశ్వత పరిష్కారం కోసం తమ న్యాయ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. హైకోర్టు ఈ కేసు తదుపరి విచారణను 2026 జూలై 22కు వాయిదా వేసింది. అప్పటి వరకు జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల చెల్లుబాటుపై అనిశ్చితి లేకుండా విధులు నిర్వహించేందుకు అవకాశం కల్పించింది. ఈ పరిణామం రాష్ట్రంలోని మీడియా వర్గాలకు ఎంతో ప్రాధాన్యత కలిగినదిగా భావిస్తున్నారు. అక్రిడిటేషన్ విధానాలు, వాటి అమలుపై ఉన్న సందేహాలు మరియు ఆందోళనలను కూడా ఈ కేసు మరోసారి వెలుగులోకి తీసుకువచ్చింది.

# బీజేపీకి తొత్తుగా ఈసీ..

**మొదటిపేజీ తరువాయి**

గౌడ్ ఆరోపించారు. సంగారెడ్డిలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్ల సమన్వయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పాల్గొన్నారు. జూన్ 23న ఆందోల్‌లో ఏఐసీసీ నేత మీనాక్షి నటరాజన్‌తో కలిసి 'సర్' ప్రక్రియపై మరో సమావేశం ఉంటుందని ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు.

**ఓట్ల గల్లంతుపై ఆందోళన:**

ప్రస్తుతం జరుగుతున్న ఓట్ల సవరణ ప్రక్రియలో కాంగ్రెస్‌కు పడవనుకున్న ఓట్లను అక్రమంగా తొలగిస్తున్నారని మహేష్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. పశ్చిమ బెంగాల్‌లో సర్ పేరుతో ఏకంగా 92 లక్షల ఓట్లను తొలగించారని, రేపు మంత్రి దామోదర, జగ్గారెడ్డి లేదా తన ఓటు గల్లంతైనా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదన్నారు. కాంగ్రెస్ ఓటు బ్యాంక్ సురక్షితంగా ఉండాలంటే క్షేత్రస్థాయిలో బూత్ లెవెల్ ఏజెంట్లు అత్యంత కీలకంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. దేవుడి పేరు చెప్పనిదే బీజేపీకి ఓట్లు పడవని, ఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని చెప్పి ఉన్న ఉద్యోగాలనే ఊడబీకుతున్నారని ధ్వజమెత్తారు. .

**కిషన్ రెడ్డి, బీఆర్ఎస్‌లకు కౌంటర్..**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై విమర్శలు చేస్తున్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి మహేష్ గౌడ్ ఘాటు కౌంటర్ ఇచ్చారు. గత 12 ఏళ్లలో తెలంగాణకు కేంద్రం ఏం చేసిందో చిట్టా విప్పాలని, విభజన హామీలను ఎందుకు నెరవేర్చలేదని నిలదీశారు. 'మీరు సబర్మతి రివర్ ఫ్రంట్ కట్టుకోవచ్చు కానీ, మేము మూసీ ప్రక్షాళన చేస్తామంటే నిధులు ఇవ్వరా?' అని ప్రశ్నించారు.

# ఉద్యోగ ఒత్తిడి తట్టుకోలేక యువతి ఆత్మహత్య

**మొదటిపేజీ తరువాయి**

తిలక్ రోడ్డుకు చెందిన గంజి కీర్తన (25) అనే యువతి తన నివాసంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, కీర్తన బెంగళూరులోని ఓ విదేశీ సంస్థలో ఉద్యోగం చేస్తూ ఉండేది. గత కొంత కాలంగా ఉద్యోగ ఒత్తిడిని తట్టుకోలేక మానసిక ఆందోళనకు గురై చికిత్స పొందుతున్నట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. ఆమె తండ్రి గంజి ఉమాశంకర్ వ్యాపార పనుల నిమిత్తం బయటకు వెళ్లగా, తల్లి కృష్ణవేణి గ్రీవెన్స్ సెల్‌కు వెళ్లారు. ఈ సమయంలో కీర్తన ఇంట్లో ఒంటరిగా ఉన్నట్లు సమాచారం. అనంతరం ఇంటికి వచ్చిన తల్లి, కిటికీ ద్వారా చూడగా కీర్తన బెడ్‌రూమ్‌లో ఫ్యాన్‌కు చున్నీతో ఉరికి వేలాడుతూ కనిపించింది. వెంటనే బంధువుల సహాయంతో తలుపులు బలవంతంగా తెరిచి లోపలికి వెళ్లి చున్నీ కోసి కిందకు దించినప్పటికీ అప్పటికే ఆమె మృతి చెందినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న ఇంతేజార్ గంజ్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కీర్తన మృతిపై తమకు ఎలాంటి అనుమానాలు లేవని కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపినట్లు సమాచారం.

# ఏఐ, యాప్‌లతో వ్యవసాయ ఆధునీకరణ

**హైదరాబాద్, జూన్ 16 సిరి న్యూస్:**

రైతులకు విత్తనాల సరఫరా నుంచి పంట ఉత్పత్తుల కొనుగోళ్ల వరకు సమగ్ర ప్రణాళికతో నిర్దిష్ట కార్యాచరణ అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వర్షాకాలం, ఖరీఫ్ సీజన్ సన్నాహకాలపై ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో ఆయన కీలక సూచనలు చేశారు. సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్ బాబు, రాజ్యసభ సభ్యుడు వేముల నరేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. పంటలు వేసిన దశ నుంచే రైతుల వివరాలు, పంటల విస్తీర్ణం, దిగుబడి అంచనాలు, కొనుగోళ్ల వరకు ప్రతి అంశంపై వ్యవసాయ శాఖకు పూర్తి సమాచారం ఉండాలని సీఎం స్పష్టం చేశారు. రైతులు ఎక్కడా ఇబ్బంది పడకుండా వచ్చే సీజన్ నుంచే ధాన్యం కొనుగోళ్లు సాఫీగా జరిగేలా వ్యవసాయ శాఖ కార్యదర్శి ఆధ్వర్యంలో ప్రత్యేక ఉన్నతాధికారుల కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కమిటీలో వ్యవసాయ శాఖ డైరెక్టర్, పౌర సరఫరాల సంస్థ ఎండీ, ప్రణాళికా విభాగం కార్యదర్శి సభ్యులుగా ఉంటారని తెలిపారు.

విత్తనాల పంపిణీ, రైతుల నమోదు, పంటల రికార్డులు, ఉత్పత్తి అంచనాలు, ధాన్యం కొనుగోళ్ల వరకు అన్ని దశలను కమిటీ పర్యవేక్షించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పరిశీలనతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ప్రతి గ్రామంలో ఏ రైతు ఏ పంట సాగు చేస్తున్నాడనే సమాచారాన్ని ఖచ్చితంగా నమోదు చేయాలని పేర్కొన్నారు. సన్న వడ్లు పండించే రైతులకు ప్రభుత్వం బోనస్ ఇస్తున్నందున ఏడు రకాల సన్న వడ్ల విత్తనాలను సబ్సిడీపై అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. రైతు వేదికల్లోనే విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, సన్న వడ్లు సాగు చేసే రైతుల పూర్తి డేటా సేకరించాలని సూచించారు. రైతు వేదికలను రైతులకు ఉపయోగపడే సేవా కేంద్రాలుగా తీర్చిదిద్దాలని, అక్కడే రైతులు తమ వివరాలు నమోదు చేసుకొని విత్తనాలు, ఎరువులు పొందేలా వ్యవస్థను అభివృద్ధి చేయాలని చెప్పారు. వ్యవసాయ రంగంలో కృత్రిమ మేధస్సు (ఏఐ) వినియోగాన్ని ప్రోత్సహించాలని సీఎం సూచించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేటలో అమలు చేస్తున్న ఏఐ పైలట్ ప్రాజెక్టు ఫలితాలను అధ్యయనం చేసి రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలని పేర్కొన్నారు. అలాగే ఎరువుల పంపిణీలో పారదర్శకత కోసం రైతులు యాప్ ద్వారా ఎరువులు బుక్ చేసుకునే విధానాన్ని ప్రవేశపెట్టాలని, యూరియాను రైతు వేదికల ద్వారా పంపిణీ చేయాలని ఆదేశించారు. ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన యూరియా, ఇతర ఎరువుల కేటాయింపుల కోసం కేంద్ర ప్రభుత్వంతో నిరంతర సమన్వయం కొనసాగించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు సూచించారు. రామగుండం ఎఫ్‌సీఐ ఎరువుల కర్మాగారంలో ఉత్పత్తి అయ్యే ఎరువులు తెలంగాణకు అధికంగా కేటాయించేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని చెప్పారు. రాష్ట్రంలోని ఎరువుల పరిస్థితిపై అన్ని పార్టీల ఎంపీలతో సమావేశం నిర్వహించి అవసరమైతే ఢిల్లీకి వెళ్లి కేంద్రానికి విజ్ఞప్తి చేయాలని సూచించారు.

మార్క్‌ఫెడ్, ఆయిల్‌ఫెడ్, ప్రభుత్వ డెయిరీల పనితీరుపైనా సీఎం సమీక్ష నిర్వహించారు. మార్క్‌ఫెడ్ నష్టాలను తగ్గించే చర్యలు చేపట్టాలని, మొక్కజొన్న కొనుగోళ్లలో ప్రభుత్వం అనుసరించిన వ్యూహాలతో నష్టం తగ్గిందని పేర్కొన్నారు. ఆయిల్‌ఫెడ్‌ను లాభాల బాటలో నడిపించాలని, ప్రభుత్వ డెయిరీని మరింత బలోపేతం చేసి పాల రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# గోమారంలో తెలంగాణ రక్షణ సేన పార్టీ జెండా ఆవిష్కరణ




**శివంపేట్, జూన్ 16, (సిరి న్యూస్)**

మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలోని గోమారం గ్రామంలో తెలంగాణ రక్షణ సేన పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆదేశాల మేరకు గోమారం చౌరస్తాలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. యువ నాయకులు రామ్ చంద్ర రెడ్డి, చంద్ర పవన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మెదక్ జిల్లా ఇంచార్జి చంద్రశేఖర్, నియోజకవర్గ ఇంచార్జి గణేష్ ముదిరాజ్, రాష్ట్ర నాయకులు అభిషేక్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం, ప్రజల తరపున ప్రశ్నించడం, రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం పోరాడడమే తెలంగాణ రక్షణ సేన పార్టీ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రాష్ట్రంలో అవినీతి పెరిగిపోవడం ఆందోళనకరమని, ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నప్పటికీ ఆశించిన స్థాయిలో స్పందన లభించడం లేదని విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తుందని, యువత రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించి సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. రానున్న రోజుల్లో గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెదక్ నియోజకవర్గ ఇన్చార్జ్ రమేష్ గౌడ్, కేవల్ నందకిషోర్ మహిళ నాయకురాలు అపర్ణ కల్లకల్ రమేష్ తిరుపతి రెడ్డి మంచోళ్ళ నవీన్ రమేష్ నాచారం శేఖర్ మణికంఠపార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ యువకులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# తల్లి ఒడికి చేరిన పసికందు

**వెల్దుర్తి, జూన్ 16, (సిరి న్యూస్ ):**

వెల్దుర్తి మండలం ఉప్పలింగాపూర్ గ్రామంలో నెలకొన్న శిశువిక్రయం అనే సమస్యకు స్పందించిన ఐసిడిఎస్, చైల్డ్ వెల్ఫేర్, అధికారులు అలాగే పోలీస్ యంత్రాంగం వెంటనే స్పందించి వెల్దుర్తికి చెందిన మధ్యవర్తి దారా శిశువును కానుకుంట గ్రామంలో విక్రయించారని తెలుసుకొని మంగళవారం పోలీసుల సమక్షంలో పసికందును తీసుకువచ్చి తల్లికి అప్పగించారు. ఇకముందు ఎవరైనా పసికందులను విక్రయిస్తే కఠిన చర్య తీసుకుంటామని ఐసిడిఎస్ అధికారులు హెచ్చరించారు.



# చివరి దశలో ధాన్యం కొనుగోళ్లు

- జిల్లాలో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి 826.34 కోట్ల రూపాయల చెల్లింపులు.
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.



**మెదక్,జూన్,16 (సిరిన్యూస్)**

మెదక్ జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ చివరి అంకంలో ఉందని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు.జిల్లా వ్యాప్తంగా ఈనాటికి 93,373 మంది రైతుల నుంచి 4,08,008,480 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని, అందులో 79,147 మంది రైతులకు 826.34 కోట్ల రూపాయలు రైతుల ఖాతాలో ప్రభుత్వం జమ చేసిందని ,జిల్లా వ్యాప్తంగా 473 ధాన్యం కొనుగోలు కేంద్రాలు మూసి వేశామన్నారు. రైతులు వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

# తాగునీటి పారిశుద్ధ డ్రైనేజీ సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైంది

- బిఆర్ఎస్ పార్టీ జీడిమెట్ల డివిజన్ సమన్వయ కమిటీ

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, జూన్ 16, (సిరిన్యూస్) :**

జీడీమెట్ల 132వ డివిజన్‌లో తీవ్రమైన తాగునీటి సమస్యలు, పారిశుద్ధ్య లోపాలు, డ్రైనేజీ సమస్యలపై మంగళవారం బీఆర్ఎస్ పార్టీ 132 డివిజన్ సమన్వయ కమిటీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతు న్నప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం మరియు సంబంధిత అధికారులు సమస్యల పరిష్కారంలో విఫలమయ్యారని విమర్శిం చింది. ప్రతి ఇంటికి తాగునీరు అందించిన మిషన్ భగీరథను నిర్వీర్యం చేసి ప్రజలను కష్టాలోకి నెట్టారని ఆరోపించింది. వెంటనే తాగునీటి సరఫరాను మెరుగుపరచాలని మరియు పారిశుద్ధ్య నిర్వహణ, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేసింది. ప్రభుత్వం స్పందించ కపోతే, ప్రజలతో కలిసి బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించింది.

## సంపాదకీయం

# విద్వేషంపై వివేకం గెలుపు !



ప్రపంచాన్ని చుట్టుముట్టిన యుద్ధ మేఘాలు తొలగిపోయాయి. దశాబ్దాలుగా మధ్యప్రాచ్యాన్ని తద్వారా యావత్ ప్రపంచాన్ని వణికించిన ఇరాన్–అమెరికా ఘర్షణలు సయోధ్యతో ముగియడం అంతర్జాతీయ దౌత్య చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయం. యుద్ధ వాతావరణం ముగిసి, ఇరు దేశాలు శాంతి ఒప్పందానికి మొగ్గు చూపడం కేవలం రెండు దేశాల విజయమే కాదు, ప్రపంచ శాంతిని కాంక్షించే ప్రతి ఒక్కరి విజయం. విద్వేషం నుండి వివేకం వైపుగత కొన్నేళ్లుగా ఇరు దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు ఎప్పుడైనా మూడో ప్రపంచ యుద్ధానికి దారితీయవచ్చనే భయాలను రేకెత్తించాయి. ఆంక్షలు, సైనిక మోహరింపులు, ప్రత్యక్ష సవాళ్లతో మధ్యప్రాచ్యం ఒక అగ్నిపర్వతంలా మారింది. అయితే, చివరకు విద్వేషంపై వివేకం గెలిచింది. యుద్ధం వల్ల జరిగే వినాశనాన్ని గుర్తించి, ఇరు దేశాల అధినేతలు చర్చల మేజాపైకి రావడం అభినందనీయం. ఆయుధాల గర్జనల కంటే దౌత్యపరమైన సంప్రదింపులే శాశ్వత పరిష్కారాన్ని చూపగలవని ఈ సయోధ్య నిరూపించింది.

### ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఊరట...

ఈ శాంతి ఒప్పందం ప్రపంచ ఆర్థిక రంగానికి ఊపిరి పోసింది. ముఖ్యంగా ముడి చమురు సరఫరాకు కీలకమైన 'హోర్ముజ్ జలసంధి' లో ఉద్రిక్తతలు తగ్గడం వల్ల అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు స్థిరీకరణకు వస్తాయి. ఇది భారతదేశం వంటి దిగుమతులపై ఆధారపడే దేశాలకు భారీ ఉపశమనం. ద్రవ్యోల్బణం తగ్గి, ప్రపంచ వ్యాప్తంగా వస్తువుల ధరలు అదుపులోకి వచ్చేందుకు ఈ సయోధ్య మార్గం సుగమం చేసింది. ఒప్పందాలు కుదరడం ఒక ఎత్తయితే, వాటిని నిలబెట్టుకోవడం మరొక ఎత్తు. గతంలో కుదిరిన అణు ఒప్పందాల వంటి చేదు అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, ఇరు దేశాలు పరస్పర నమ్మకాన్ని కాపాడుకోవాలి. అంతర్జాతీయ సమాజం, ఐక్యరాజ్యసమితి ఈ శాంతి ప్రక్రియకు పర్యవేక్షకులుగా ఉంటూ, ఎలాంటి ఉల్లంఘనలు జరగకుండా చూడాలి. ఇరాన్ ప్రాంతీయ శక్తులతో సత్సంబంధాలు నెలకొల్పుకోవడం, అమెరికా ఏకపక్ష ఆంక్షలకు స్వస్తి చెప్పడం ఈ శాంతి నిలబడడానికి కీలకం. యుద్ధం ఎప్పుడూ విజేతలను మిగల్చదు, శ్మశానాలను మాత్రమే మిగులుస్తుంది. ఈ సత్యాన్ని గ్రహించి అమెరికా, ఇరాన్ దేశాలు శాంతి బాట పట్టడం నవ శకానికి ఆరంభం. ఈ సయోధ్య కేవలం తాత్కాలిక విరామంగా మిగిలిపోకుండా, మధ్యప్రాచ్యంలో శాశ్వత శాంతికి, ప్రపంచ దేశాల మధ్య సత్సంబంధాలకు బలమైన పునాదిగా మారాలని ఆశిద్దాం.

# థింక్ బిగ్.. వర్క్ హార్డ్

- లక్ష్యంతో అడుగులు వేసి ఉన్నత శిఖరాలు చేరాలి..
- విద్యార్థులకు ఎమ్మెల్సీ మల్క కొమరయ్య దిశానిర్దేశం
- పల్లవి ఇంజినీరింగ్ కాలేజీలో ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానం
- తెలంగాణ పీపుల్స్ వాయిస్ ఆధ్వర్యంలో వేడుకలు



**హైదరాబాద్, సిరి న్యూస్**

ప్రతి విద్యార్థి జీవితంలో ఒక నిర్దేశిత లక్ష్యంతో ముందుకు సాగుతూ, అందొచ్చే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని టీచర్ ఎమ్మెల్సీ, పల్లవి గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషన్స్ ఛైర్మన్ మల్క కొమరయ్య పిలుపునిచ్చారు. మంగళవారం కుంట్లూరులోని పల్లవి ఇంజినీరింగ్ కాలేజీలో 'తెలంగాణ పీపుల్స్ వాయిస్' సౌజన్యంలో నిర్వహించిన 'ఎక్సలెన్స్ అవార్డ్స్ 2026' కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ వేడుకల్లో ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సుమారు 150 మంది విద్యార్థులకు, ఆయా కాలేజీల ప్రిన్సిపల్స్, తల్లిదండ్రుల సమక్షంలో మెడల్స్, ప్రశంసా పత్రాలను అందజేశారు.

### ఇష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరాలి

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మల్క కొమరయ్య మాట్లాడుతూ.. భారతదేశ భవిష్యత్తు అంతా విద్యార్థుల చేతుల్లోనే ఉందన్నారు. విద్యను కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో దూసుకుపోతోందని, '2047 వికసిత్ భారత్' లక్ష్యంతో అడుగులు పడుతున్నాయన్నారు. దేశంలో కొత్తగా మరో 16 యూనివర్సిటీలను మంజూరు చేయడం వల్ల ఉన్నత కోర్సుల కోసం విదేశాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా.. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వంటి అత్యాధునిక కోర్సులు, ఉద్యోగ అవకాశాలు మన దేశంలోనే అందుబాటులోకి వస్తాయన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఎన్నో మల్టీనేషన కంపెనీల సీఈఓలుగా మన భారతీయు ఉండటం గర్వకారణమన్నారు.

### మొబైల్ ఫోన్ల వ్యామోహం వీడాలి

ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ ఆకెళ రాఘవేంద్ర మాట్లాడుతూ.. జీవితంలో ప్ర ఒక్కరూ నిత్య విద్యార్థిగా ఉండాల ఆకాంక్షించారు. ఈ రోజుల్లో యువ టెక్నాలజీ ముసుగులో మొబైల్ ఫోన్ల పూర్తిగా బానిసలుగా మారిపోతున్నార ఆవేదన వ్యక్తం చేశారు. ఫోన్ల చాటింగ్‌లు, డేటింగ్‌లు ఆపేసి.. 'వా నెక్స్ట్' అని కెరీర్ గురించి ఆలోచించాల హితవు పలికారు. మొబైల్ ఫోన్లపై పె శ్రద్ధను చదువుపై పెడితే అద్భుతాలు సృష్టి చవచ్చన్నారు. విద్యార్థులు ఈ స్థాయి ఉండటానికి కారణమైన తల్లిదండ్రులక చదువు నేర్పిన గురువులకు ఎల్లప్పుడ రుణపడి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పద్మశ్రీ అవార్డు గ్రహీ వెంకటేశ్వరరావు, కాలేజీ యాజమా ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో విద్యార్థు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఢిల్లీ కుట్రలను తిప్పికొడతాం..!

- సర్ పేరుతో ఓట్లను కొల్లగొట్టే కుట్ర
- ఒక్క ఓటు కూడా పోకుండా చూడాలి
- బీజేపీ తోలుబొమ్మలాటలో పవన్ ఒక బొమ్మ
- రాష్ట్రానికి కేంద్రం ఏం చేసిందో కిషన్‌రెడ్డి చెప్పాలి
- సంగారెడ్డిలో టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్

**సంగారెడ్డి, జూన్ 16(సిరిన్యూస్):**

బీజేపీ ఆడించే తోలుబొమ్మలాటలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఒక బొమ్మలా ఆడుతున్నారని, తెలంగాణ కోసం ఆయన చేసిందేమీ లేదని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై నియోజకవర్గ బూత్ లెవల్ శిక్షణా శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పార్టీలో అంతర్గత క్రమశిక్షణ అత్యంత ముఖ్యమని, కొందరు నేతలు పార్టీ అంతర్గత విషయాలను మీడియాకు, విపక్షాలకు లీక్ చేస్తూ పార్టీ ప్రతిష్టను దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారని, ఇలాంటి లీకుల రాజకీయాన్ని అధిష్టానం తీవ్రంగా పరిగణిస్తోంది.. ఎంతటి వారైనా సరే.. పార్టీ గీత దాటితే క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు. మీడియాలో ప్రభుత్వ పథకాలను, ఆరు గ్యారెంటీలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్ళాలని తెలిపారు.

### ఢిల్లీ కుట్రలను తిప్పికొడదాం...

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మన రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సాధిస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేకపోతోంది. ఢిల్లీ వేదికగా కేంద్ర ప్రభుత్వ సంస్థలను వాడుకుంటూ కాంగ్రెస్ పట్ల కుట్రలు చేస్తోంది. ఇటీవల మన జాతీయ నాయకురాలు మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ వ్యవహారంలో బీజేపీ రాజకీయ ఒత్తిళ్లు తెచ్చి అప్రజాస్వామికంగా వ్యవహరించింది. అలాగే, సర్ పేరుతో తెలంగాణలో కాంగ్రెస్ సానుభూతిపరుల ఓట్లను దొంగతనంగా తొలగించేందుకు బీజేపీ, ఈసీతో కలిసి కుట్రలు చేస్తోందని ఆరోపించారు. మన బూత్ లెవెల్ ఏజెంట్లు, గ్రామ స్థాయి కార్యకర్తలు ప్రతి ఓటరు జాబితాను నిశితంగా పరిశీలించాలన్నారు. ఒక్క కాంగ్రెస్ ఓటు కూడా తొలగించబడకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత మీపై ఉందన్నారు.

### దేవుడి పేరుతో బీజేపీ రాజకీయం...

దేవుడి పేరుతో బీజేపీ రాజకీయం చేస్తుందని మహేశ్‌కుమార్ గౌడ్ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు దేవుడి పేరుతో ఓట్లు అడగలేదన్నారు. చేసిన పనిని చూపి కాంగ్రెస్ ఓట్లడిగిందని వెల్లడించారు. ఎన్నికల సంఘం జేజేపీ తో మూలాఖత్ అయిందని, రాబోయే ఎన్నికల్లో ఓటుతోనే బీజేపీ పార్టీ కుప్పకులుతుందని చెప్పారు. పదేళ్లలో బీఆర్ఎస్ ఏమీ చేయలేదంటూ మండిపడ్డారు. మన ప్రభుత్వం విద్య, వైద్యానికి పెద్దపీట వేసిందని, రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో 100 సీట్లు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ ఏర్పాటుపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చేస్తున్న వ్యాఖ్యలు కేవలం రాజకీయ లబ్ధి కోసమేనని, తోలుబొమ్మలా బీజేపీ ఆడించినట్లు మాట్లాడటం మానుకోవాలని హితవు పలికారు. తెలంగాణ వచ్చినప్పుడు 10 రోజులు అన్నం తినలేదని పవన్ కళ్యాణ్ చెప్పడం హాస్యాస్పదమన్నారు. కేంద్రం నుంచి నిధులు తీసుకురావడంలో కిషన్ రెడ్డి విఫలమయ్యారని ఫైర్ అయ్యారు. 12 ఏళ్ళల్లో మీరు ఎం చేశారో చిట్టా ఇవ్వాలని కోరారు. కేంద్రం నుంచి రాష్టానికి ఇంకా నిధులు రావాలని,

కేంద్ర ప్రభుత్వం విభజన హామీలని ఇప్పటివరకు నెరవేర్చలేదన్నారు. మీరు సబర్మతి కట్టుకోవచ్చు..మేము మూసి ప్రక్షాళన చేస్తామంటే నిధులు ఇవ్వరా అంటూ మండిపడ్డారు.




### కార్యకర్తలకు అండగా ఇందిరమ్మ రాజ్యం..

పదేళ్ల బీఆర్ఎస్ అరాచక పాలన అంతమొందించి, కార్యకర్తల త్యాగా పునాదులపై ముఖ్యమంత్రి రేవంత్ రె నాయకత్వంలో మనం ప్రజా ప్రభుత్వా ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. గ ప్రభుత్వంలో కాంగ్రెస్ కార్యకర్తలపై అక్ర కేసులు పెట్టి వేధించారని, మ ప్రభుత్వంలో ప్రతి కార్యకర్తను కంటి రెప్పలా కాపాడుకునే బాధ్యత పీసీసీ అధ్యక్షుడిగా తానది, ముఖ్యమంత్రి రేవం రెడ్డిదే అన్నారు. త్వరలోనే పార్టీ కోస కష్టపడిన క్షేత్రస్థాయి కార్యకర్తల నామినేటెడ్ పదవుల్లో, కమిటీల సముచిత స్థానం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆరోగ్య శాఖా మం దామోదర రాజనర్సింహ, జహీరాబా ఎంపీ సురేష్ శెట్కార్, డీసీసీ అధ్యక్షురా నిర్మల, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెం జగ్గారెడ్డి, మెదక్, జహీరాబాద్ పార్లమెం ఇంచార్జిలు నీలం మధు, అనిల్‌కుమా నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకుల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# గీతంలో ప్రాజెక్టు అసోసియేట్ అవకాశం

• ఏఎన్ఆర్ఎఫ్ నిధులతో పరిశోధన ప్రాజెక్టుకు దరఖాస్తుల ఆహ్వానం



**రామచంద్రపురం (పటాన్చెరు), జూన్ 16, (సిరి న్యూస్) :**

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాద్ ప్రాంగణంలోని స్కూల్ ఆఫ్ సైన్స్‌లో అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ (ఏఎన్ఆర్ఎఫ్) నిధులతో నిర్వహిస్తున్న పరిశోధన ప్రాజెక్టుకు ప్రాజెక్టు అసోసియేట్ పోస్టు భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రధాన పరిశోధకురాలు డాక్టర్ టి. స్వరూప రాణి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.మైక్రోబయాలజీ, బయోటెక్నాలజీ, వ్యవసాయ శాస్త్రాలు, బయోకెమిస్ట్రీ, నానోటెక్నాలజీ, లైఫ్ సైన్సెస్ లేదా సంబంధిత విభాగాల్లో ఎమ్మెస్సీ పూర్తి చేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఎంపికైన అభ్యర్థికి నెలకు రూ.30 వేల ఫెలోషిప్‌తో పాటు హెచ్ఆర్ఏ అందజేయనున్నట్లు పేర్కొన్నారు.ప్రారంభంలో ఒక సంవత్సరం పాటు నియామకం ఉండగా, పనితీరు ఆధారంగా గరిష్ఠంగా మూడు సంవత్సరాల వరకు పొడిగించే అవకాశం ఉందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు తమ బయోడేటా, విద్యా ధ్రువపత్రాల ప్రతులను ఈ నెల 22వ తేదీలోగా stirupaa@gitam.edu కు పంపాలని సూచించారు. ఎంపికైన వారికి ఆన్‌లైన్ ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు తెలిపారు.

# ముత్తంగిలో అంబేద్కర్ భవనానికి త్వరలో శంకుస్థాపన

స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**రామచంద్రపురం (పటాన్ చెరు), జూన్ 16, (సిరి న్యూస్):**

ముత్తంగి గ్రామంలో అంబేద్కర్ భవన నిర్మాణానికి త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం గ్రామంలో పర్యటించిన ఆయన ఎంక చెరువు సమీపంలో ప్రతిపాదిత భవన నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు.గ్రామ ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని 200 గజాల స్థలంలో అన్ని వసతులతో అంబేద్కర్ భవనాన్ని నిర్మించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలకు ఉపయోగపడేలా భవనాన్ని అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు.నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, అభివృద్ధి కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తున్నామని ఎమ్మెల్యే చెప్పారు. త్వరలోనే భవన నిర్మాణ పనులను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో హెచ్ఎండీఏ డీఈ రామారావు, మాజీ సర్పంచ్ ఉపేందర్, నాయకులు శ్రీనివాస్, యాదయ్య, మేరాజ్ ఖాన్, శ్రీనివాస్ రెడ్డి, సందీప్, పుణ్యవతి తదితరులు పాల్గొన్నారు

# వర్షా కాలానికి ముందే పెండింగ్ పనులు పూర్తి చేయాలి.

జోనల్ కమిషనర్ ను కలిసిన మాజీ కార్పొరేటర్ పుష్ప నగేష్




**రామచంద్రపురం, జూన్ 16, (సిరి న్యూస్):**


రామచంద్రపురం డివిజన్‌లో పలు కాలనీలకు మంజూరైన అభివృద్ధి పనులు ఇప్పటికీ ప్రారంభం కాకపోవడంతో పాటు కొన్ని పనులు అసంపూర్తిగా ఉండటంపై మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ ఆందోళన వ్యక్తం చేశారు. కాలనీవాసులతో కలిసి జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్‌ను కలిసి సమస్యలను వివరించారు.రానున్న వర్షాకాలానికి ముందే పెండింగ్ పనులు పూర్తి చేయకపోతే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని ఆయన తెలిపారు. దీనిపై స్పందించిన జోనల్ కమిషనర్ సంబంధిత ఇంజినీరింగ్ శాఖ అధికారులను అప్రమత్తం చేసి, పెండింగ్ పనుల ప్రాంతాలను వెంటనే పరిశీలించి కాంట్రాక్టర్ల ద్వారా పనులు ప్రారంభించాలని ఆదేశించారు.అలాగే శ్రీ సాయినగర్ కాలనీలో మిగిలి ఉన్న రెండు రోడ్లు, మల్లికార్జున నగర్ కాలనీలో రోడ్ల అభివృద్ధి పనులు, రిటైనింగ్ వాల్ నిర్మాణానికి సంబంధించి కాలనీవాసులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ పనులకు రానున్న బడ్జెట్‌లో నిధులు కేటాయించేలా చర్యలు తీసుకుంటామని జోనల్ కమిషనర్ హామీ ఇచ్చినట్లు పుష్పనగేష్ తెలిపారు.

# పాఠశాల ప్రారంభానికి అమావాస్య అడ్డంకి..!

• సెంటిమెంట్‌తో సోమ, మంగళవారాల్లో విద్యార్థుల హాజరు తగ్గుదల

**గుమ్మడిదల, జూన్ 16 (సిరి న్యూస్):**

నూతన విద్యా సంవత్సరం ప్రారంభం రోజున అమావాస్య రావడం వల్ల పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలలకు పంపేందుకు సంకోచించిన పరిస్థితి కనిపించింది. ఈ విద్యా సంవత్సరం ప్రారంభమైన సోమవారం అమావాస్య కావడంతో కొంతమంది తల్లిదండ్రులు సెంటిమెంట్ కారణంగా పిల్లలను ఇంటి వద్దనే ఉంచారు. దీంతో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఆశించిన స్థాయిలో విద్యార్థుల హాజరు నమోదు కాలేదు. అలాగే జూన్ 16న మంగళవారం కావడంతో మంగళవారం కూడా పిల్లలను పాఠశాలకు పంపకుండా బుధవారం నుంచి పంపించాలని కొందరు తల్లిదండ్రులు నిర్ణయించుకున్నారు. అమావాస్య, మంగళవారం వంటి రోజులపై ఉన్న సంప్రదాయ నమ్మకాలు, సెంటిమెంట్ ప్రభావం కారణంగా విద్యార్థుల హాజరుపై ప్రభావం పడినట్లు ఉపాధ్యాయ వర్గాలు పేర్కొంటున్నాయి. సాధారణంగా విద్యా సంవత్సరం ప్రారంభమైన తొలి రోజుల్లోనే పాఠశాలలు విద్యార్థుల సందడితో కళకళలాడుతుంటాయి. అయితే ఈసారి సోమ, మంగళవారాల్లో తరగతి గదులు పూర్తిస్థాయిలో నిండకపోవడం గమనార్హం. కొందరు తల్లిదండ్రులు మాత్రం ఇలాంటి సెంటిమెంట్లను పక్కనపెట్టి పిల్లలను పాఠశాలలకు పంపగా, మరికొందరు శుభదినం కోసం వేచి చూశారు. అయితే జూన్ 17 బుధవారం నుంచి విద్యార్థుల హాజరు గణనీయంగా పెరిగే అవకాశముందని, పాఠశాలలు పూర్తిస్థాయి విద్యార్థులతో మళ్లీ కలకలాడే పరిస్థితి నెలకొంటుందని విద్యాశాఖ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి. నూతన విద్యా సంవత్సరానికి సంబంధించిన పాఠ్యబోధన, పుస్తకాల పంపిణీ, ఇతర కార్యక్రమాలు కూడా వేగం పుంజుకునే అవకాశం ఉందని పేర్కొంటున్నారు.




# వీరభద్ర స్వామి ఆలయ ఈవోగా రామ బ్రహ్మచారి బాధ్యతల స్వీకరణ

**గుమ్మడిదల, జూన్ 16 (సిరి న్యూస్):**

బొంతపల్లి శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి దేవస్థానం నూతన కార్యనిర్వహణ అధికారిగా (ఈవో) రామ బ్రహ్మచారి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్‌లోని చిక్కడపల్లిలో గల శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో విధులు నిర్వహిస్తున్న ఆయనకు పదోన్నతి లభించడంతో బొంతపల్లి దేవస్థానానికి బదిలీపై నియమితులయ్యారు.ఇప్పటి వరకు బొంతపల్లి ఆలయ కార్యనిర్వహణ అధికారిగా సేవలందించిన శశిధర్ గుప్తా చంపాపేట్‌లోని ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయానికి బదిలీపై వెళ్లిన నేపథ్యంలో, గ్రేడ్-1 కార్యనిర్వహణ అధికారిగా రామ బ్రహ్మచారి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా రామ బ్రహ్మచారి మాట్లాడుతూ, జిల్లాలో



ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రంగా పేరుగాంచిన బొంతపల్లి శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి దేవస్థానాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. భక్తులకు మెరుగైన సేవలు అందించడం, ఆలయ పరిశుభ్రత, నిర్వహణ ప్రమాణాలను మరింత మెరుగుపరచడం, దేవస్థానం అభివృద్ధికి సంబంధించి అవసరమైన కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తామని ఆయన వెల్లడించారు. ఆలయానికి వచ్చే ప్రతి భక్తుడు సంతృప్తిగా దర్శనం చేసుకునేలా ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు.

# బడిబాటలో భాగంగా సామూహిక అక్షరాభ్యాసం

• బొంతపల్లి పాఠశాలలో చిన్నారుల తొలి అక్షరాల సందడి

**గుమ్మడిదల, జూన్ 16 (సిరి న్యూస్):**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంపుతో పాటు విద్యాపట్ల చిన్నారుల్లో ఆసక్తిని పెంపొందించేందుకు నిర్వహిస్తున్న బడిబాట కార్యక్రమంలో భాగంగా బొంతపల్లి ప్రాథమిక పాఠశాలలో మంగళవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గుమ్మడిదల పురపాలక సంఘం పరిధిలోని బొంతపల్లి ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని తొలి అక్షరాలను దిద్దుతూ విద్యాభ్యాసంలో అడుగుపెట్టారు. ఈ సందర్భంగా కాంప్లెక్స్ ఉపాధ్యాయుడు భాస్కర్‌రావు మాట్లాడుతూ ప్రతి చిన్నారికి విద్య అందించాలనే లక్ష్యంతో బడిబాట కార్యక్రమాన్ని విస్తృతంగా చేపడుతున్నట్లు తెలిపారు. పాఠశాల వయస్సు కలిగిన ప్రతి బాలబాలిక తప్పనిసరిగా పాఠశాలలో చేరేలా చర్యలు తీసుకుంటున్నామని, ఇప్పటికే చేరిన విద్యార్థులు కూడా క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు ఉచిత పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం, యూనిఫాంలు, విద్యా సామగ్రి వంటి సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారి భవిష్యత్తుకు బాటలు




వేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అంజయ్య, ఉపాధ్యాయులు టేకులపల్లి సునీత, అపర్ణ, శారద, నిర్మల, కవిత, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు శారద, స్వప్న, పోచమ్మతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# కొత్తపల్లి గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠ, దుర్గమ్మ జాతర ఉత్సవాలు

**గుమ్మడిదల, జూన్ 16 (సిరి న్యూస్):**

గుమ్మడిదల మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో సంప్రదాయబద్ధంగా నిర్వహించే దుర్గమ్మ జాతర ఉత్సవాలతో పాటు బొడ్రాయి ప్రతిష్ఠ కార్యక్రమాలు ఈ నెల 18వ తేదీ నుంచి వైభవంగా నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతీకగా నిలిచే ఈ ఉత్సవాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 18వ తేదీన బొడ్రాయి ఊరేగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. అనంతరం 19వ తేదీన బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవం వేద



మంత్రోచ్చారణల నడుమ భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నారు. 20వ తేదీన ఊరులమ్మ, లింగమయ్య స్వామి పూజా కార్యక్రమాలు ప్రత్యేకంగా చేపట్టనుండగా, 21వ తేదీన గ్రామ దైవమైన దుర్గమ్మ జాతర అత్యంత వైభవంగా జరగనుంది. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ ప్రతి ఏటా సంప్రదాయబద్ధంగా నిర్వహించే ఈ ఉత్సవాలు గ్రామ ప్రజల ఐక్యతకు, భక్తి భావాలకు ప్రతీకగా నిలుస్తాయని తెలిపారు. నాలుగు రోజుల పాటు జరిగే ఈ వేడుకల్లో ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, సంప్రదాయ ఆచారాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కొత్తపల్లి గ్రామ ప్రజలతో పాటు పరిసర గ్రామాల భక్తులు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని గ్రామస్తులు కోరారు. భక్తులందరికీ అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# విద్యార్థుల హాజరు శాతం పెంచడమే లక్ష్యం

• 90 శాతానికి పైగా హాజరు నమోదు చేసిన విద్యార్థులకు ప్రశంసా పత్రాల ప్రదానం

• 100 శాతం హాజరే లక్ష్యంగా చర్యలు

• ప్రధానోపాధ్యాయులు విజయ్‌కుమార్

**గుమ్మడిదల, జూన్ 16 (సిరి న్యూస్):**

విద్యార్థుల్లో క్రమశిక్షణ, చదువుపై ఆసక్తి పెంపొందించడంతో పాటు పాఠశాల హాజరు శాతాన్ని మెరుగుపర్చే లక్ష్యంతో గత విద్యా సంవత్సరంలో 90 శాతానికి పైగా హాజరు నమోదు చేసిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందిస్తూ ప్రశంసా పత్రాలను అందజేశారు. గుమ్మడిదల మండల పరిధిలోని మంబాపూర్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఈ ప్రశంసా పత్రాల ప్రదానం జరిగింది. గత విద్యా సంవత్సరంలో క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై 90 శాతానికి పైగా హాజరు నమోదు చేసుకున్న విద్యార్థులకు డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కార్యాలయం తరఫున జారీ చేసిన ప్రశంసా పత్రాలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయ్‌కుమార్ విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్ నిర్మాణంలో క్రమబద్ధమైన పాఠశాల హాజరు కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ప్రతిరోజూ పాఠశాలకు హాజరవడం ద్వారా విద్యార్థుల్లో విద్యా నైపుణ్యాలు పెంపొందడంతో పాటు సామాజిక విలువలు, hక్రమశిక్షణ, బాధ్యతాయుత భావన అలవడతాయని అన్నారు. గత విద్యా సంవత్సరంలో అధిక హాజరు నమోదు చేసిన విద్యార్థులను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా ఇతర విద్యార్థుల్లోనూ ఉత్తేజం నింపాలనే ఉద్దేశంతో ఈ ప్రశంసా పత్రాలను అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుత నూతన విద్యా సంవత్సరంలో పాఠశాలలో ప్రతి విద్యార్థి వంద శాతం హాజరు నమోదు చేసేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లు వెల్లడించారు. విద్యార్థులు పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరయ్యేలా తల్లిదండ్రులతో నిరంతర సమన్వయం కొనసాగించడంతో పాటు, హాజరు శాతంపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపడుతున్నట్లు చెప్పారు. ఇక ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న బడిబాట



కార్యక్రమంలో భాగంగా మంగళవారం పాఠశాలలో అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తొలిసారిగా పాఠశాలలో అడుగుపెట్టిన చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి విద్యారంభం చేయించారు. విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు విద్య యొక్క ప్రాముఖ్యతను వివరించి ప్రతి చిన్నారిని పాఠశాలలో చేర్పించాలని అవగాహన కల్పించారు. అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ రేణుక, వార్డు సభ్యులు భాస్కర్, మౌనిక, నీల,ఉపాధ్యాయురాలు సుజాత, స్థానిక నాయకులు కమ్మరి అశోక్ చారి తదితరులు పాల్గొన్నారు.

# మైలురాళ్ల రంగుల వెనుక ఉన్న అర్థం తెలుసా?

- ఏ రంగు ఏ రహదారికి సంకేతమో తెలుసా?
- రంగులను బట్టి రహదారి స్వభావాన్ని గుర్తించండి
- మైలురాళ్ల ప్రత్యేకత తెలుసుకుంటే ప్రయాణం సులభం

**గుమ్మడిదల, జూన్ 16(సిరి న్యూస్) :**

నిత్యం ఏదో ఒక పనిమీద రోడ్లపై ప్రయాణించే సమయంలో మనకు తరచుగా కిలోమీటర్ బోర్డులు, మైలురాళ్లు కనిపిస్తుంటాయి. అయితే వాటిపై ఉన్న సంఖ్యలను మాత్రమే గమనిస్తూ, అవి ఏ రంగులో ఉన్నాయో, ఆ రంగులకు ఉన్న ప్రత్యేక గుర్తింపు ఏమిటో చాలా మంది పట్టించుకోరు. ప్రయాణికులు ఆ రంగుల అర్థం తెలుసుకుంటే తాము ప్రయాణిస్తున్న మార్గం ఏ శాఖ పరిధిలో ఉందో సులభంగా గుర్తించవచ్చు. ప్రయాణ సమయంలో కేవలం గమ్యస్థానానికి ఎంత దూరం ఉందనే విషయానికే పరిమితం కాకుండా, మైలురాళ్ల రంగుల ద్వారా రహదారి స్వభావాన్ని కూడా తెలుసుకోవచ్చు. ప్రతి మైలురాయికి ఒక ప్రత్యేక గుర్తింపు ఉందన్న విషయాన్ని ప్రజలు తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ అవగాహనతో ప్రయాణం మరింత సమాచారపూర్వకంగా మారుతుంది. మైలురాళ్లపై ఉండే రంగుల వెనుక ఉన్న అర్థాన్ని తెలుసుకోవడం ద్వారా ప్రయాణికులు తాము ప్రయాణిస్తున్న మార్గం స్వభావాన్ని సులభంగా అర్థం చేసుకోవచ్చు. సాధారణ జ్ఞానంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో సరైన నిర్ణయాలు తీసుకోవడంలో ఈ సమాచారం ఉపయోగపడుతుంది.







### పసుపు రంగు మైలురాళ్లు

పసుపు రంగు మైలురాళ్లు కనిపిస్తే ఆ రహదారి జాతీయ రహదారి (నేషనల్ హైవే) అని అర్థం. ఇవి దేశంలోని ప్రధాన నగరాలు, రాష్ట్రాలను అనుసంధానించే కీలక రహదారులు.

### ఆకుపచ్చ రంగు మైలురాళ్లు

ఆకుపచ్చ రంగు మైలురాళ్లు రాష్ట్ర రహదారులను సూచిస్తాయి. ఇవి ఒక రాష్ట్రంలోని ప్రధాన పట్టణాలు, జిల్లాలను కలుపుతూ రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో నిర్వహించబడతాయి.

### నలుపు రంగు మైలురాళ్లు

నలుపు లేదా నలుపు-తెలుపు రంగు మైలురాళ్లు నగర రహదారులను సూచిస్తాయి. ఇవి మున్సిపల్ సంస్థలు లేదా స్థానిక సంస్థల ఆధ్వర్యంలో ఉండే పట్టణ ప్రాంత రహదారులు.

### నారింజ రంగు మైలురాళ్లు

నారింజ రంగు మైలురాళ్లు గ్రామీణ రహదారులకు సంకేతం. గ్రామాలను సమీప పట్టణాలతో అనుసంధానించే ఈ రహదారులు గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో ఉంటాయి.

### ఎరుపు రంగు గుర్తులు

ఎరుపు రంగు గుర్తులు సాధారణంగా రైల్వే ప్రాంతాలు లేదా రైల్వేకు సంబంధించిన మార్గాలను సూచిస్తాయి. ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాల్సిన ప్రాంతాలుగా వీటిని పరిగణిస్తారు.

### నీలం రంగు గుర్తులు

నీలం రంగు గుర్తులు విమానాశ్రయాలకు వెళ్లే మార్గాలను తెలియజేస్తాయి. విమాన ప్రయాణికులకు సరైన దిశను సూచించేందుకు ఈ బోర్డులను ఏర్పాటు చేస్తారు.

### గోధుమ రంగు గుర్తులు

గోధుమ రంగు గుర్తులు పర్యాటక ప్రాంతాలు, చారిత్రక కట్టడాలు లేదా ప్రత్యేక సందర్శనీయ ప్రదేశాలకు దారి చూపుతాయి. పర్యాటకులకు ఇవి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి.

### బూడిద రంగు గుర్తులు

బూడిద రంగు గుర్తులు వంతెనలు, సొరంగ మార్గాలు వంటి ప్రత్యేక నిర్మాణాలకు సంబంధించిన సమాచారాన్ని అందిస్తాయి. ఆయా ప్రాంతాల్లో జాగ్రత్తగా ప్రయాణించాలని సూచిస్తాయి.ప్రయాణికులకు అవగాహన అవసరం

# ఓటర్ల హక్కుల పరిరక్షణకు కాంగ్రెస్ కట్టుబడి ఉంది..

- ఓటర్ల జాబితా సవరణపై బిఎల్ఏ లకు ప్రత్యేక శిక్షణ
- ప్రతి అర్హత కలిగిన ఓటు నమోదయ్యేలా చర్యలు : కాట శ్రీనివాస్ గౌడ్

**రామచంద్రపురం (పటాన్‌చెరు), జూన్ 16 (సిరి న్యూస్):**

ఓటర్ల హక్కుల పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని, ప్రతి అర్హత కలిగిన వ్యక్తి ఓటరుగా నమోదు కావడంతో పాటు జాబితాలో వారి పేరు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ అన్నారు.పటాన్‌చెరులోని ఎస్వీఆర్ గార్డెన్స్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై బూత్ లెవల్ ఏజెంట్ల (బీఎల్ఏ) కోసం అవగాహన, శిక్షణ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్లమెంట్ కోఆర్డినేటర్ ప్రీతమ్, అసెంబ్లీ కోఆర్డినేటర్ దయాకర్, డీసీసీ అధ్యక్షురాలు, టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, మెదక్ పార్లమెంట్ ఇంచార్జ్ నీలం మధు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ప్రీతమ్, దయాకర్‌లు బీఎల్ఏలకు ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ, మార్పులు, చేర్పులు, తొలగింపులకు సంబంధించిన విధివిధానాలపై సమగ్ర శిక్షణ అందించారు. ప్రతి బూత్ పరిధిలో అర్హులైన ఓటర్లను గుర్తించి నమోదు చేయడం, వివరాల్లో ఉన్న పొరపాట్లను సరిచేయించడం, అర్హులైన ఓటర్లు జాబితా నుంచి తొలగించబడకుండా అప్రమత్తంగా వ్యవహరించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు.కాట శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, ఓటరు జాబితా ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలస్తంభమని అన్నారు. ప్రతి ఓటు విలువైనదని, అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏలు క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలని సూచించారు. ఓటర్ల హక్కులను పరిరక్షించడం ప్రతి కార్యకర్త బాధ్యత అని పేర్కొన్నారు.సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, బూత్ లెవల్ ఏజెంట్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ప్రమాదం పొంచి ఉన్నా పట్టించుకోని అధికారులు

- శిథిలావస్థలో మొగ్దుంపల్లి ప్రాథమిక పాఠశాల
- అనర్థం జరిగే ముందు అధికారులు స్పందించాలి

**మునిపల్లి, జూన్ 16 (సిరి న్యూస్):**

మునిపల్లి మండలం మొగ్దుంపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుని విద్యార్థులు, ఉపాధ్యాయులకు ప్రమాదకరంగా మారింది. భవనం పైకప్పు కాంక్రీట్ పూర్తిగా ఊడిపోవడంతో ఇనుప రాడ్లు బయటకు కనిపిస్తున్నాయి. గోడలు తేమతో దెబ్బతిని, పలుచోట్ల పగుళ్లు ఏర్పడ్డాయి.తరగతి గదుల పైకప్పు ఎప్పుడు కూలిపోతుందోనన్న భయాందోళనల మధ్య విద్యార్థులు చదువుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అనర్థం జరిగే ముందు అధికారులు స్పందించి పాఠశాల భవనాన్ని మరమ్మతు చేయాలని, అవసరమైతే కొత్త భవనం నిర్మించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.





# వెల్దుర్తి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్పీ

**వెల్దుర్తి, జూన్ 16, (సిరి న్యూస్ ):**

మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు మంగళవారం వెల్దుర్తి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులు, కేసుల దర్యాప్తు పురోగతి, సిబ్బంది విధుల నిర్వహణ, స్టేషన్ నిర్వహణ తదితర అంశాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తును వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందించే దిశగా ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది బాధ్యతతో పనిచేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి, వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, బీట్ వ్యవస్థ అమలు, నేరాల నివారణకు చేపడుతున్న చర్యలను సమీక్షించిన ఎస్పీ, స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా ప్రతిరోజూ వాహన తనిఖీలు నిర్వహించాలని, సరైన పత్రాలు, నంబర్ ప్లేట్లు లేని వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనాలను స్వాధీనం చేసుకుని చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామంలో నిఘా నేత్రాలు సరిగ్గా పనిచేస్తూ లేవని విషయం తెలుసుకున్న ఎస్పీ త్వరలో నేను సైతం కార్యక్రమం ద్వారా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ తనిఖీలో తూప్రాన్ సీఐ వెంకట్ రాజ్ గౌడ్, వెల్దుర్తి ఎస్ఐ రాజు తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# సామూహిక అక్షరాభ్యాసాన్ని ప్రారంభించిన ఎంఈఓ బుచ్చ నాయక్!!

**శివంపేట జూన్ 16 ( సిరి న్యూస్ )**

బడిబాట కార్యక్రమంలో భాగంగా మండల విద్యాధికారి బుచ్చనాయక్ ప్రాథమిక పాఠశాల దంతానపల్లని సందర్శించినారు. అనంతరం పాఠశాల పరిఘరాలను, . తరగతి గదులను పరిశీలించినారు.ఆ తర్వాత ఒకటవ తరగ విద్యారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ బడిఈడు పిల్లలందరు ప్రభుత్వ పాఠశాలలో చేరి నాణ్యమైన విద్యను పొందాలని మరియు ప్రైవేట్ పాఠశాలలో చేర్పించవద్దని ఆ అధిక ఫీజులు చెల్లించి అర్థికంగా నష్టపోవద్దని తెలియజేసినారు. ఈ కార్య క్ర మంలో గ్రామ సర్పంచ్, ఏ ఏ పీ సి చైర్మన్, వార్డు సభ్యులు విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



# రాజీయే రాజమార్గం..

**లోక్ అదాలత్ ద్వారా బాధితులకు సత్వర న్యాయం.**

**మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి.**

**మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు.**

**మెదక్,జూన్ 16 (సిరిన్యూస్)**




ఈ నెల 20 శనివారం నిర్వహించనున్న రెండవ జాతీయ మెగా లోక్ అదాలత్‌ను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు కోరారు.లోక్ అదాలత్ ద్వారా రాజీ పడదగిన కేసులను పరస్పర అంగీకారంతో త్వరితగతిన పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదాలు, ఆస్తి విభజన వివాదాలు, కుటుంబ మరియు వైవాహిక జీవితానికి సంబంధించిన కేసులు, బ్యాంకు రికవరీ కేసులు, విద్యుత్ చౌర్యం కేసులు, చెక్ బౌన్స్ కేసులు తదితర అంశాల్లో ఇరువర్గాలు రాజీ ద్వారా సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు.చిన్న చిన్న వివాదాలను పెద్ద కక్షలుగా మార్చుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం, ధనం వృథా చేసుకోవద్దని సూచించారు. "రాజీయే రాజమార్గం" అని పేర్కొంటూ, న్యాయశాఖ కల్పించిన ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకుని తమ వివాదాలకు శాశ్వత పరిష్కారం పొందాలని కోరారు.జిల్లాలోని పోలీస్ అధికారులు, కోర్టు విధులు నిర్వహించే పోలీస్ సిబ్బంది రాజీ పడదగిన కేసులను గుర్తించి ఇరువర్గాల వారిని పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి అవగాహన కల్పిస్తారని తెలిపారు. తమ కేసుల్లో రాజీ కావాలనుకునే వారు సంబంధిత పోలీస్ అధికారులను సంప్రదించాలని సూచించారు.

# ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశాలకు ఆహ్వానం.

- ఐటిఐ ప్రిన్సిపాల్ గుమ్మకొండ శ్రీనివాసులు.

**మెదక్, జూన్ 16 (సిరిన్యూస్)**



తెలంగాణ ప్రభుత్వ ఉపాధి మరియు శిక్షణ శాఖ హైదరాబాద్ 2026 27 విద్య సంవత్సరానికి ప్రభుత్వ ఐటిఐ అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లలో వివిధ ఇంజనీరింగ్ మరియు నాన్ ఇంజనీరింగ్ ట్రేడ్స్ ప్రవేశాల కొరకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు మెదక్ ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపల్, మెదక్ జిల్లా కన్వీనర్ గుమ్మకొండ శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.పదవ తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు సంబంధిత ట్రేడ్ అర్హతల ప్రకారం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.ప్రవేశాలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్వహించబడతాయన్నారు.అభ్యర్థుల అధికారిక వెబ్సైట్ iti.telangana.gov.in ద్వారా ఆన్లైన్లో నమోదు చేసుకుని దరఖాస్తు సమర్పించాలని సూచించారు. తేదీ 01-08- 2026 నాటికి 14 సంవత్సరాలు పూర్తి చేసిన అభ్యర్థులు ప్రవేశాలకు అర్హులు అని అన్నారు.అభ్యర్థులు రూ.100 దరఖాస్తు మరియు వెరిఫికేషన్ ఫీజును ఆన్లైన్ ద్వారా చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.ఆన్లైన్ అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లను స్పష్టంగా స్కాన్ చేసి అప్లోడ్ చేయాలని సూచించారు. మెరిట్, రిజర్వేషన్ నిబంధనలు మరియు అభ్యర్థులు ఇచ్చిన వెబ్ ఆప్షన్ల ఆధారంగా సీట్లు కేటాయించబడతాయని సూచించారు.

# పటేల్ గూడా లో నీటి కష్టాలు

**జోనల్ కమిషనర్ కు స్థానికుల ఫిర్యాదు**

**అమీన్పూర్ జూన్ 16 సిరి న్యూస్**




అమీన్పూర్ జిహెచ్ఎంసి పరిధిలోనీ పటేల్ గూడా ప్రాంతంలో గత కొన్ని రోజులుగా తాగునీటి సరఫరా సరిగా లేక పోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం ఈర్ల వెంకటేష్ ఆధ్వర్యంలో స్థానిక గ్రామ ప్రజలు కాలనీవాసులు కలిసి జోనల్ కమిషనర్ను కలిసి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్య తీవ్రత రోజుల తరబడి నీరు రాకపోవడంతో ప్రైవేట్ ట్యాంకర్లను ఆశ్రయించాల్సి రావడం వల్ల ఎదురవుతున్న ఆర్థిక భారాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

### త్వరితగతిన చర్యలు

పైప్లైన్ లీకేజీలు లేదా మోటార్ల మరమ్మత్తుల వల్ల ఈ సమస్య వస్తుందని అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపాలని ఆయన డిమాండ్ చేశారు.

### అధికారుల హామీ

ఫిర్యాదు పై సానుకూలంగా స్పందించిన జోనల్ కమిషనర్ సంబంధిత వాటర్ వర్క్స్ అధికారులతో మాట్లాడి నీటి సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పటేల్ కూడా గ్రామస్తులు కాలనీ వాసులు పాల్గొన్నారు.

# విద్యతోనే వ్యక్తి, సమాజ అభివృద్ధి సాధ్యం..

- తెల్లాపూర్ అక్షరాభ్యాస కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మల్లేపల్లి బుచ్చిరెడ్డి

**రామచంద్రపురం, జూన్ 16 (సిరి న్యూస్):**



తెల్లాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం నిర్వహించిన అక్షరాభ్యాస కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి పీఏసీఎస్ చైర్మన్ మల్లేపల్లి బుచ్చిరెడ్డి హాజరై చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి ఆశీర్వదించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య ప్రతి మనిషి జీవితానికి పునాది అని, సమాజ అభివృద్ధికి విద్యే ప్రధాన సాధనమని అన్నారు. ప్రతి ఒక్కరూ విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని, విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు ఒడ్డే నర్సింలు, సాగర్ ఇంద్రారెడ్డి, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# కాకరకాయ ఒక్కసారి ఇలా ట్రై చేసి చూడండి

కాకరకాయ పేరు వింటేనే చాలామంది ముఖం తిప్పేసుకుంటారు. ఇంట్లో కాకరకాయ కూర చేశారంటే ఆ రోజు ఉపవాసం ఉంటారు. ఎందుకంటే కాకరకాయ చేదుగా ఉంటుందని,తింటే అంత రుచిగా ఉండదని అనుకుంటారు. కానీ సరిగ్గా వండితే ఇతర కర్రీల కంటే కాకర కాయ రుచి అద్భుతంగా ఉంటుంది. అంతేకాకుండా చేదుగా ఉండే కాకరకాయలో ఎన్నో పోషక గుణాలు ఉంటాయని డాక్టర్లు చెబుతుంటారు. కాకరకాయ ఉల్లి కారం ఒక్కసారి తిన్నారంటే ఆ టేస్ట్ జన్మలో మర్చిపోరు. వేడి అన్నం,పప్పు చారు,రసం ఇలా దేనితోనైనా తింటే చాలా రుచిగా ఉంటుంది. కాకరకాయ ఉల్లికారం తయారీకి కావాల్సిన పదార్థాలు,తయారీ విధానం చూడండి.

**కాకరకాయ ఉల్లికారం తయారీకి కావాల్సిన పదార్థాలు**

కాకరకాయ
ఉల్లిపాయ
నూనె
ఉప్పు
పసుపు
కారం
జీలకర్ర
వెల్లుల్లి



ముందుగా 400 గ్రాముల లేత కాకరకాయలను తీసుకొని వాటిపైన చెక్కు తీసుకోండి. తర్వాత కాకరకాయ తల, తోక కట్ చేసి కాకరకాయని రెండు ఇంచు ముక్కలుగా కట్ చేసి ఓ బౌల్ లో వేసుకోండి. ఇప్పుడు కాకరకాయ ముక్కలలో 1 టీస్పూన్ పసుపు, 1 టీస్పూన్ ఉప్పు వేసి బాగా పట్టించి అరగంట సేపు పక్కన ఉంచండి.

అరగంట తర్వాత కాకరకాయల్లో నుంచి నీరు అంతా దిగుతుంది. అప్పుడు ఒక్కో కాకరకాయను బాగా చేతులోకి తీసుకొని పిండితే అందులోని మిగిలిన చేదు కూడా పోతుంది. అలా పిండిన తర్వాత ఆ ముక్కలను పక్కన ఓ ప్లేట్ లో పెట్టుకోండి. ఇప్పుడు మిక్సీ జార్ లో పెద్దగా కట్ చేసిన పావు కిలో ఉల్లిపాయలు,8 వెల్లుల్లి రెబ్బలు,1 టీస్పూన్ జీలకర్ర, 2 టేబుల్ స్పూన్ల కారం,కొంచెం ఉప్పు వేసి మెత్తని పేస్ట్ లా చేసుకోండి. తర్వాత స్టవ్ మీద బాండీ పెట్టి పావు కప్పు ఆయిల్ పోసి అది కొంచెం వేడయ్యాక అందులో కాకరకాయ ముక్కలను వేసి 56 నిమిషాలు వేపుకోండి. తర్వాత కాకరకాయ ముక్కలను ఓ ప్లేట్ లోకి తీసుకొని వాటిల్లోని గింజలను తీసేసి మిక్సీలో వేసి చేసుకున్న మిశ్రమాన్ని కాకరకాయ ముక్కల్లో స్టఫ్ గా చేసుకోండి. ఇప్పుడు కాకరకాయలు వేపుకున్న నూనెలోనే మరో 2 టేబుల్ స్పూన్ల నూనె వేసి అందులో స్టఫ్ చేసుకున్న కాకరకాయ ముక్కలను వేయండి. మిగిలిన ఉల్లిపాయ పేస్ట్ ని కూడా అందులో వేసి మీడియం ఫ్లేమ్ మీద 20 నిమిషాలు వేపుకోవాలి.

దింపే ముందు కొంచెం కరివేపాకు చల్లుకోండి. అంతే కరివేపాకు ఉల్లిపాయ కారం రెడీ.



# కలబందను ఎలా వాడాలి?

కలబంద ఆరోగ్యానికి మాత్రమే కాదు.. అందానికి కూడా ప్రయోజనకరంగా ఉంటుంది. దీన్ని ఉపయోగించి ఎన్నో చర్మ సమస్యలను తగ్గించుకోవచ్చు. అందుకే దీని జెల్ ను డైరెక్ట్ గా ముఖానికి పెట్టేస్తుంటారు. కానీ కలబంద జెల్ ను తీసి అలాగే ముఖానికి పెడితే ఏమౌతుందో తెలుసా? కలబంద జెల్ లో ఎన్నో ఔషద లక్షణాలుంటాయి. ఇది మనకు కెమికల్స్ లాగా ఎలాంటి హాని చేయడదు. అయినప్పటికీ.. దీన్ని డైరెక్ట్ గా అంటే కలబంద గుజ్జును తీసి ముఖానికి పెట్టుకుంటే కొన్ని సమస్యలను ఫేస్ చేయాల్సి వస్తుందని నిపుణులు చెబుతున్నారు.

కలబంద జెల్ లో మన శరీరానికి, చర్మానికి మేలు చేసే పోషకాలు పుష్కలంగా ఉంటాయి. కానీ ఈ జెల్ ను అలాగే ముఖానికి పెట్టుకోవడం మంచిది కాదని నిపుణులు చెబుతున్నారు.

కలబంద జెల్ లో టీ ట్రీ ఆయిల్ తో పాటుగా కొన్ని సహజ పదార్థాలను కలపకుండా ముడి కలబందను ముఖానికి ఉపయోగిస్తే కొన్ని చర్మ సమస్యలు వస్తాయి. ఇది చర్మ రకం, సున్నితత్వం మీద ఆధారపడి ఉంటుంది.

కొంతమందికి ముడి కలబందను ఉపయోగించడం వల్ల ఎలాంటి సమస్యలు రాకపోవచ్చు. కానీ కొంతమందికి అలెర్జీ, దద్దుర్లు, దురద, చర్మం ఎర్రబడటం వంటి సమస్యలు వస్తాయి.


నిజమేంటంటే? కలబంద ప్రతి చర్మ రకానికి సరిపోదు. కాబట్టి దీన్ని ఉపయోగించే ముందు ఇది పడుతుందా? లేదా? అని చెక్ చేసుకోవాలి. నేషనల్ సెంటర్ ఫర్ కాంప్లిమెంటరీ అండ్ ఇంటిగ్రేటివ్ హెల్త్ ప్రకారం.. చర్మానికి లోతైన కోతలు లేదా గాయాలు ఉంటే మాత్రం మీరు ఎట్టిపరిస్థితిలో కలబంద జెల్ ను ఉపయోగించకూడదు. ఎందుకంటే కలబంద జెల్ శస్త్రచికిత్సకు సంబంధించిన లోతైన గాయాలు నయం కావడానికి మీ చర్మ సహజ సామర్థ్యాన్ని తగ్గిస్తుంది. పలు నివేదికల ప్రకారం.. కలబంద జెల్ ను పెట్టుకునేటప్పుడు కొంతమందికి మంట, దురద వంటి సమస్యలు వచ్చాయి.

ఒకవేళ దీనివల్ల దద్దుర్లు అయితే మాత్రం వెంటనే దీన్ని పెట్టడం ఆపేయాలి. అలాగే చర్మ అంటువ్యాధులు ఉంటే కూడా కలబంద జెల్ ను పెట్టుకోకూడదు. ఎందుకంటే ఇది అంటువ్యాధులను మరింత పెంచుతుంది.





# మంచంపై కూర్చొని తింటున్నారా? ఈ ఇబ్బందులు తప్పవు..!



మంచం మీద కూర్చొని భోజనం చేయకూడదని ఇంట్లో పెద్దలు చెప్పడం మనం చాలాసార్లు వినే ఉంటాము. పెద్దలు ఎప్పుడూ నేలపై కూర్చొని తినమని సలహా ఇస్తారు. అయితే దీని వెనుక వారి వాదన ఏమిటంటే.. మంచం మీద కూర్చొని తినడం వల్ల లక్ష్మీ దేవిని అవమానిస్తున్నట్లు అని, ఆలా చేయడం ద్వారా ఆమెకు కోపం వస్తుందని చెబుతుంటారు.

ఇది మతపరమైన కారణం. కానీ, శాస్త్రీయ దృక్కోణంలో కూడా మీ ఈ అలవాటు సరైనది కాదు. సుఖం కోసం మీరు కూడా మంచం మీద హాయిగా కూర్చొని తినడం ఆనందిస్తే, ఈ అలవాటు మీ ఆరోగ్యానికి చాలా హానికరం కలిగిస్తుంది. నిజానికి మనం ఏం తింటున్నాం? ఎలా తింటున్నాం? అనేది కూడా చాలా ముఖ్యం. కాబట్టి, మీరు మంచం మీద కూర్చొని ఆహారం ఎందుకు తినకూడదో ఒకసారి చూద్దాం..

**జీర్ణక్రియపై చెడు ప్రభావం:**

నేలపై కూర్చునే భంగిమ కంటే బెడ్‌లోని భంగిమ రిలాక్సింగ్‌గా మారుతుంది. భోజనం చేసేటప్పుడు రెండు భంగిమలు మీ జీర్ణక్రియకు మంచివి కావు. ఇది మీ జీర్ణవ్యవస్థపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది.

కొన్నిసార్లు ఇది కడుపులో భారం, యాసిడ్ రిఫ్లక్స్ కు కారణమవుతుంది. ఈ నేపథ్యంలో మంచం మీద కూర్చొని ఆహారం తినాల్సి వస్తే నిటారుగా కూర్చొని సరైన భంగిమలో తినడానికి ప్రయత్నించండి.

**నిద్ర ప్రభావితం**

ప్రతిరోజూ బెడ్‌పై ఆహారం తీసుకోవడం కూడా మన నిద్రపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. ఇలా చేయడంవల్ల మన శరీరం ఒక నిర్దిష్ట స్థలాన్ని, దానికి సంబంధించిన కార్యకలాపాలను బాగా గుర్తిస్తుంది. పడక ఎప్పుడూ నిద్రతో ముడిపడి ఉన్నట్లే, స్టడీ టేబుల్ ఎప్పుడూ చదువులతో ముడిపడి ఉంటుంది. కానీ, మీరు మంచం మీద పడుకునే బదులు ఆహారం తిన్నప్పుడు అది మీ మనస్సుకు కొంచెం గందరగోళంగా అనిపించవచ్చు. ప్రతిరోజూ ఇలా చేయడం వల్ల, మీరు కొన్నిసార్లు మంచం మీద పడుకోవడంలో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటారు.

**వేగంగా ఊబకాయం**

మంచం మీద భోజనం చేయడం వల్ల మీ బరువు వేగంగా పెరుగుతుంది. దీని వెనుక చాలా ఆసక్తికరమైన మానసిక కారణం ఉంది. నిజానికి మీరు రిలాక్స్డ్ మూడ్‌లో బెడ్‌పై కూర్చొని ఆహారం తిన్నప్పుడు, సాధారణంగా టీవీ లేదా మొబైల్‌లో వినోదం కూడా దానితో పాటు కొనసాగుతూనే ఉంటుంది. అలా హాయిగా తిండి తిన్నప్పుడు చాలా సార్లు రెండు పూటలా ఆకలితో కాస్త ఎక్కువగానే తినేస్తాం. రోజువారీ ఈ చిన్న అదనపు కేలరీలు మీ బరువు పెరగడానికి కారణమవుతాయి.

**అలెర్జీల సంక్రమణ ప్రమాదం**

మంచం మీద కూర్చొని ఆహారం తినేటపుడు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా కొన్ని ఆహారపు రేణువులు బెడ్ పైనే ఉండిపోతాయి. ఈ చిన్న కణాలు చాలా రోజులు బెడ్ లేదా బెడ్ షీట్స్ లో ఉంటాయి. కొన్నిసార్లు ఆహర కణాల కారణంగా బొద్దింకలు, చీమలు మంచంలోకి వచ్చే ప్రమాదం కూడా పెరుగుతుంది. దీంతో ఇన్‌ఫెక్షన్ వ్యాప్తి చెందుతుందనే భయం పెరుగుతుంది.

# మోహం మీద ముడతలు పోవాలంటే.. ఇవే టిప్స్

ముఖం అందంగా కనిపించాలని ప్రతీ ఒక్కరూ ఏదో ఒక్క ప్రయత్నం చేస్తునే ఉంటారు. వయస్సు పైబడే కొద్దీ ముఖంపై ముడతలు సమస్య ఎక్కువైపోతుంది. ఇప్పుడుఉన్న జీవన విధానంలో చిన్నవయస్సులోనే ముడతల సమస్య ఇబ్బందిపెడుతోంది. కాలుష్యం, ఒత్తిడి, పోషకాహార లోపం, ఒత్తిడి కారణంగా ముడతలు వచ్చే అవకాశం ఉంది. చాలా మంది ముడతలు తగ్గించుకోవడానికి కాస్మెటిక్ ప్రొడక్ట్స్ వాడుతారు.

నాచురల్‌గానే ముడతలను మాయం చేయడానికి కొన్ని చిట్కాలు సహాయపడతాయి. అవేంటో తెలుసుకుందాం.





నేరుగా తాకే ఎండ వల్ల చర్మం అడుగున ఉండే కొల్లాజెన్ దెబ్బతిని, తరిగిపోయి ముడతలు ఏర్పడే అవకాశం ఉంది. కలబందలో మాయిశ్చరైజింగ్ గుణాలు ఉంటాయి. కలబదం గుజ్జును తరచూ ముఖానికి అప్లై చేసుకుంటే హైడ్రేషన్‌ను మెరుగుపరుస్తుంది. ఇది ముడతలు, ఫైన్‌లైన్స్‌ను తగ్గిస్తుంది. అలాగే..తేనెలోని యాంటీఆక్సిడెంట్ గుణాలు ఫ్రీరాడికల్స్ నుంచి చర్మ కణాలను రక్షిస్తాయి. చర్మంపై త్వరగా ముడతలు పడకుండా కాపాడతాయి. ముడతలను నివారించాడానికి తేనెను ముఖానికి అప్లై చేయవచ్చని నిపుణులు చెబుతున్నారు. దీన్ని 20 నిమిషాల పాటు ఆరనిచ్చి.. ఆ తర్వాత గోరువెచ్చని నీటితో ముఖం శుభ్రం చేసుకుంటే ముడతలు తగ్గుతాయి. కొబ్బరి నూనెలో ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి చర్మాన్ని హైడ్రేట్‌గా ఉంచడానికి పోషణ అందించడానికి తోడ్పడుతుంది. నిద్రపోయే ముందు ముఖం శుభ్రం చేసుకుని, కొద్దిగా కొబ్బరి నూనెతో ముఖాన్ని సున్నితంగా మసాజ్ చేయాలి. ఉదయం నిద్రలేచిన తర్వాత చల్లని నీళ్లతో ముఖం శుభ్రం చేసుకుంటే మంచి ఫలితాలు కనిపిస్తాయి. ముడతలు పోగొట్టడంలో పెరుగు కూడా తన పాత్ర పోషిస్తుంది. ముఖానికి పెరుగు అప్లై చేసి, 20 నిమిషాల పాటు ఆరనివ్వండి. ఆ తర్వాత ముఖాన్ని శుభ్రం చేసుకోండి. ఇలా వారానికి రెండు సార్లు చేస్తే.. ముడతలు మాయం అయ్యి, కాంతివంతమైన చర్మం పొందవచ్చు.

# గుడికి కురులు విరబోసుకోని వెళ్తున్నారా..?

గుడి.. ఈ ప్రాంగణాన్ని అత్యంత పవిత్రమైనదిగా మన హిందువులు భావిస్తూ ఉంటారు. సాధారణంగా ఒక మహిళ గుడికి వెళ్ళే ముందు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి అన్నది పురాతన కాలం నుండి పూర్వీకులు కొన్ని శాస్త్రాలను రూపొందించి పెట్టారు. ఇప్పుడు ఉన్న ప్రస్తుత జీవన విధానంలో ఎన్నో మర్పులు వచ్చాయి. ఎన్నో పద్దతులు,అలవాట్లు మారాయి. ఇందులో ముఖ్యంగా మహిళలు జుట్టు విరబోసుకోని గుడికి వెళ్లడం మంచిది కాదని శాస్త్రాలు బెబుతున్నాయి..అవేంటో తెలుసుకుందాం

ఒకప్పుడు మహిళలు కురులను ముడుచుకొని చక్కగా వాటి చుట్టు పువ్వులను అలంకరించుకొని గుడికి వెళ్లేవారంటా. ఇప్పడు ఉన్న పరిస్థితుల్లో చలా మంది గుడికి కురులు విరబోసుకునే వెళ్తుంటారు. జుట్టు విరబోసుకుని ఉంటే పూజలు దేవుడి అంగీకరించరు అన్న విషయం ప్రచారంలో ఉంది. అలాగే..గుడికి వెళ్ళినప్పడు మన మనసు అంతా దేవుడి మీదనే ఉండాలి. ఇక పూజలో ఉన్న సమయంలో వెంట్రుకలు విరబోసుకుని ఉంటే అవి మనల్ని ఎంతగానో ఇబ్బంది పెట్టే అవకాశం ఉంటుంది. కాబట్టి స్త్రీలు గుడికి వెళ్ళే ముందు వెంట్రుకలు మంచిగా జడ వేసుకుని వెళ్ళాలి. శాస్త్రాల ప్రకారం దేవుడి సన్నిదిలో చిన్న వెంట్రుక పడిన దోషంగానే పరిగనించబడుతుంది. అయితే చాలా మందికి ఎందుకు అలా చేయకూడదు అని సందేహం కలుగవచ్చు. అయితే దీనికి శాస్త్రాలలో తగు కారణాలు చెప్పబడి ఉన్నాయి. గుడిలోకి తల విరబోసుకుని వెళ్ళకూడదు అని మన ఇంట్లో కూడా తరచూ చెప్పడం మీరు గమనించవచ్చు.






# నల్లని ద్రాక్షలో ఆరోగ్య ప్రయోజనాలు ఎన్నో..

నల్లని ద్రాక్ష.. ఈ పండ్లు చాలా వరకు అందరికీ తెలుసు. సహజంగా ఇవి పుల్లగా ఉంటాయని తినడానికి ఇష్టపడరు. పచ్చని ద్రాక్షపండ్లనే ఇష్టపడుతూ ఉంటారు. ఐతే నల్లద్రాక్షలో యాంటీ ఆక్సిడెంట్లు, ఫైబర్, విటమిన్లు, ఖనిజాలు ఉన్నాయి. ఈ పండ్లు తింటే పలు ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. అవేమిటో తెలుసుకుందాం.



క్రమం తప్పకుండా తీసుకుంటే నల్ల ద్రాక్షతో పలు దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలకు చెక్ పెట్టొచ్చు. ఈ నల్ల ద్రాక్షలో విటమిన్లు ఎ, సి, బి6, ఫోలిక్ యాసిడ్స్, సిట్రస్ యాసిడ్స్, గ్లూకోజ్, మెగ్నీషియం, జింక్ వంటి అనేక పోషకాలు ఉన్నాయని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. ఈ పండ్లు పొటాషియం కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడానికి సహాయపడుతాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. విటమిన్ సిని కలిగి ఉండి రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడుతుంది. ఇది రక్తపోటును తగ్గించడంలో సహాయపడుతుంది. అలాగే నల్ల ద్రాక్షలో ఇనుము, విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు వంటి పోషకాలు జుట్టు కుదుళ్లను స్ట్రాంగ్ చేయడానికి సహాయపడతాయి. నల్ల ద్రాక్షను తీసుకోవడం వల్ల ఏకాగ్రత, జ్ఞాపక శక్తిని మెరుగు పరుస్తుంది. మైగ్రేన్ తో బాధ పడేవారు కూడా నల్ల ద్రాక్షను తీసుకుంటే కంట్రోల్ అవుతుందని నిపుణులు చెబుతున్నారు. నల్ల ద్రాక్షను తినడం వల్ల మధు మేహాన్ని కంట్రోల్ చేసుకోవచ్చు. నల్లద్రాక్షలో ఉండే ఫైటోకెమికల్స్ గుండెలో పేరుకొనే చెడు కొలెస్ట్రాల్‌ని తగ్గించి అక్కడి కండరాలకు మేలుచేస్తాయని వెల్లడైంది. వీటిలోని యాంటీఆక్సిడెంట్లు శరీరంలోని వ్యర్థాలను తొలగించి, బరువు తగ్గించేందుకు కారణం అవుతాయి.





# వేడిని తట్టుకునే టిప్స్

గత కొద్ది రోజుల నుంచి అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజలు కొంత ఇబ్బంది పడుతున్నారు. ఎండ అధికంగా ఉండడంతో పలు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. లేకపోతే దాని బారిన పడే అవకాశం లేకపోలేదని సూచిస్తున్నారు. 'బయటకు వెళ్లేవారు గొడుగు, కళ్లద్దాలు, హెల్మెట్, గ్లౌజ్‌లు వాడాలి. తీసుకునే ఆహారంలో తగినంత ఉప్పు, నీరు, పోషక విలువలు ఉండేవిధంగా చూసుకోవాలి. పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లు తాగడం ఈ సమయంలో ఆరోగ్యానికి మంచిది. ఒంటికి వదులుగా ఉండే దుస్తులు ధరించాలి. రోజుకు కనీసం నాలుగు లీటర్ల మంచినీరు తీసుకోవాలి. ఇంట్లో వాతావరణం చల్లగా ఉండే విధంగా చూసుకోవాలి. ఎండలోకి తప్పనిసరిగా వెళ్లేవారు సన్‌స్క్రీన్ లోషన్స్ తప్పనిసరిగా వాడాలి. ముఖ్యంగా పసి పిల్లలపై ఎండ ప్రభావం పడకుండా చూసుకోవాలి. ఉదయం 8 గంటలలోపే పిల్లలకు స్నానాలు ముగించాలి. వారికి పలుచని దుస్తులు వేయాలి. అదేవిధంగా వృద్ధుల విషయంలో కూడా అత్యంత జాగ్రత్తగా ఉండాలి. వారు ఇంటి నుంచి బయట రాకుండా ఉండేలా చూడాలి. ఒకవేళ తప్పనిసరి అయితే, అన్ని జాగ్రత్తలు తీసుకుని వారిని బయటకు తీసుకురావాలి' ఇలా జాగ్రత్తలు తీసుకుంటే ఎండ నుంచి ఎండా వేడిమి నుంచి బయటపడొచ్చని చెబుతున్నారు.



# పితృస్వామ్యానికి, వాతావరణ మార్పులకు సంబంధం ఉంది

బాలీవుడ్ నటి దియా మీర్జా (Dia Mirza) వాతావరణ సంక్షోభంపై చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. పితృస్వామ్యానికి, వాతావరణ మార్పులకు సంబంధం ఉందని తాను చేసిన వ్యాఖ్యలను దియా మీర్జా సమర్థించుకున్నారు. ఇటీవల సోహా అలీఖాన్ 'ఆల్ అబౌట్ హర్' పాడ్‌కాస్ట్‌లో దియా మాట్లాడారు. ఫొటోగ్రాఫర్ ఆరతికుమార్ రావుతో కలిసి ఎకోఫెమినిజంపై ఆమె చర్చించారు.

'వాతావరణ మార్పు కేవలం పర్యావరణ సమస్య కాదు. ఇది అసమానతల సమస్య కూడా. ఏళ్లుగా పురుషాధిక్య వ్యవస్థలు ప్రకృతిని దోచుకున్నాయి. శతాబ్దాలుగా, పితృస్వామ్య వ్యవస్థలు అధికారాన్ని చేపట్టాయి. సంరక్షణ కంటే దోపిడీకే ప్రాధాన్యమిచ్చి, ప్రకృతిని, బలహీన వర్గాలను దోపిడీకి గురయ్యే వనరులుగా చూశాయి. ఇది పితృస్వామ్య సమాజంలో మహిళలు, బాలికలను చూసే విధానం లాంటిదే' అని ఆమె అన్నారు. 'స్త్రీలను చూసినట్లే అడవులు, నదులను వస్తువుల్లా చూశాయి. వరదలు, కరవు వస్తే మొదట ఇబ్బందిపడేది ఆడవాళ్లు, పిల్లలే. కానీ నిర్ణయాలు తీసుకోవడంలో వారికి చోటు లేదు. ఆధిపత్యం పోయి, కరుణ, సమానత్వం ఉంటేనే పరిష్కారం దొరుకుతుంది' అని ఆమె తేల్చి చెప్పారు.



# చీరలో ఫైట్లు చేయడం.. చాలా కష్టమైంది

'మా ఇంటి బంగారం' చిత్రంతో ప్రేక్షకుల్ని అలరించేందుకు సిద్ధమవుతోంది నటి సమంత. ఆమె ప్రధాన పాత్రధారిగా నటించిన ఈ సినిమాని నందినీ రెడ్డి తెరకెక్కించిన సంగతి తెలిసిందే. రాజ్ నిడిమోరు, సమంత, హిమాంక్ దువ్వూరు నిర్మించారు. దిగంత్, గుల్షన్ దేవయ్య, గౌతమి తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ఈ నెల 19న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం రాత్రి హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ వేడుకని నిర్వహించారు. దర్శకులు దేవా కట్టా, డీకే, రాహుల్ రవీంద్రన్, నిర్మాతలు డి.సురేశ్‌బాబు, వై రవిశంకర్, స్వప్న దత్ అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నటి సమంత మాట్లాడుతూ.. "ఈ సినిమాతో కచ్చితంగా ఒకొక్కర్ని ప్రేమతో కొడతా. దీన్ని మేమంతా చాలా ప్రేమతో చేశాం. ఇప్పటి వరకు నటిగా నా కెరీర్ చాలా సాఫీగా సాగిపోయింది. కానీ, నటిగా, నిర్మాతగా ఉండటంలో ఉన్న కష్టమేంటన్నది నాలుగైదు రోజులుగా అర్థమవుతోంది. సమష్టి కృషి వల్లే ఈ చిత్రం సాధ్యమైంది. ఈ సినిమాలో నేను చాలా సహజంగా నటించానంటే దానికి ప్రధాన కారణం దీంట్లో ఉన్న సంభాషణలే. ఇందులో నేను చీరలో ఫైట్లు చేశాను. చాలా కష్టంగా అనిపించింది. దీంట్లో యాక్షన్ సన్నివేశాలన్నీ అలరిస్తాయి. ఈ సినిమాలో ప్రతిఒక్కరూ అద్భుతంగా నటించారు" అన్నారు.

"నా జీవితంలో ఈ సినిమాకి పడినంత కష్టం ఏ చిత్రానికి పడలేదు. సమష్టి కృషితో దీన్ని ఆరు నెలల్లో పూర్తి చేయగలిగాం. సమంత, రాజ్ నాపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకున్నానని నమ్ముతున్నా. ఈ నెల 19న మీకు నచ్చిన సామ్‌ని పది రెట్లు గొప్పగా తెరపై చూస్తారు" అన్నారు దర్శకురాలు నందినీ రెడ్డి. ఈ కార్యక్రమంలో చిన్మయి, దిగంత్, ఆనంద్, హిమాంక్, శ్రీలక్ష్మి, గవిరెడ్డి, పానీ వర్మ తదితరులు పాల్గొన్నారు.





# ఆ రోజుల్లోనూ విమర్శలు ఉండేవి కానీ..!


90ల కాలంలో కూడా విమర్శలు ఉండేవి.. కానీ అప్పట్లో సోషల్ మీడియా లేకపోవడం వల్ల అవి మా వరకు వచ్చేవి కావని అంటోంది బాలీవుడ్ సీనియర్ నాయిక మాధురీ దీక్షిత్. ఇటీవలే 'మా బెహన్'తో ప్రేక్షకుల్ని పలకరించిందీమె. ఈ నేపథ్యంలోనే ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె తన కెరీర్ ప్రారంభంలో ఎదురైన విమర్శల గురించి కొన్ని ఆసక్తికర విషయాల్ని పంచుకుంది. "సినీరంగంలో నటీమణులు ఎక్కువ విమర్శలకు గురవుతారు. 1980లో చిత్ర పరిశ్రమకు వచ్చినప్పుడు నేను కూడా ఇలాంటివే ఎదుర్కొన్నాను. అప్పుడు నేను చాలా సన్నగా ఉన్నానని.. 'ఈమెకు ఏదైనా తినిపించండి' అనేవారు. ఇక్కడ బరువు పెరిగినా ట్రోల్ చేస్తారు.. సన్నగా అయినా విమర్శిస్తారు. అప్పట్లో సోషల్ మీడియా, ట్రోలింగ్ సంస్కృతి లేకపోవడంతో ఇలాంటి వ్యాఖ్యలను ఎదుర్కోవడం చాలా సులభమైంది. నా దృష్టిలో వీటన్నింటినీ తేలికగానే తీసుకోవాలి. మరీ ఎక్కువగా ప్రాధాన్యత ఇవ్వకూడదు"ని చెప్పుకొచ్చింది మాధురి.

# మరో వివాదంలో విష్ణుప్రియ.. ఐదుగురితో సెక్స్ చేశానంటూ నెట్టింట బోల్డ్ వీడియో

టాలీవుడ్ యాంకర్ విష్ణు ప్రియ పలు టీవీ షోల్లో తన గ్లామర్, చలాకీ తనంతో అందరినీ మెప్పించారు. పలు తెలుగు, తమిళ చిత్రాల్లో నటించి ఫేమ్ పాపులారిటీ రాబట్టుకున్నారు. పలు టీవీ షోల్లో యాంకర్‌గా వ్యవహరించడంతో పాటు సోషల్ మీడియాలో తన బోల్డ్ ఫొటోలు షేర్ చేస్తూ అందరినీ ఆశ్చర్య పరచడంతో పాటు చిక్కుల్లో పడుతోంది. ఇటీవల ఒక ప్రత్యేక సబ్‌స్క్రిప్షన్ యాప్ ద్వారా డబ్బులు సంపాదించే క్రమంలో ఆమె కొన్ని బోల్డ్ వీడియోలను షేర్ చేయడంతో నెట్టింట తీవ్ర విమర్శలు వచ్చాయి. సామాజిక బాధ్యత మరిచి అర్థనగ్న ఫొటోలు, వీడియోలు పెడుతోందంటూ ఏఐఎస్ఎఫ్ (AISF) నాయకులు ఆమెపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ వివాదం ఇంకా పూర్తిగా ముగియకముందే, యాంకర్ విష్ణుప్రియ తాజాగా మరో కొత్త చిక్కుల్లో పడ్డారు. సోషల్ మీడియాలో అభిమానులతో ముచ్చటించడానికి ఆమె ఒక లైవ్ క్యూ అండ్ ఏ సెషన్‌ను నిర్వహించారు. ఈ లైవ్ సెషన్‌లో నెటిజన్లు అడిగిన పలు ప్రశ్నలకు ఆమె సమాధానాలు ఇస్తూ వచ్చారు.

అయితే, ఈ క్రమంలో ఒక నెటిజన్ విష్ణుప్రియను ఉద్దేశించి 'మీ బాడీ కౌంట్ ఎంత?' (అంటే ఇప్పటివరకు ఎంతమందితో శృంగారంలో పాల్గొన్నారు?) అంటూ బోల్డ్ ప్రశ్నను అడిగారు. సాధారణంగా సెలబ్రిటీలు ఇటువంటి అసభ్యకరమైన లేదా వ్యక్తిగత ప్రశ్నలు ఎదురైనప్పుడు వాటిని స్కిప్ చేస్తారు లేదా సదరు నెటిజన్‌పై మండిపడతారు. కానీ విష్ణుప్రియ మాత్రం అస్సలు వెనకడుగు వేయకుండా, ఎంతో ఓపెన్‌గా సమాధానం ఇచ్చి అందరినీ షాక్‌కు గురి చేశారు. తాను ఇప్పటివరకు ఐదుగురితో సెక్స్ చేసినట్లు ఆమె ఏమాత్రం మొహమాటం లేకుండా లైవ్‌లోనే సమాధానం ఇచ్చారు. అంతేకాకుండా బోల్డ్ డ్రెస్‌లో ఎద అందాలు జూమ్ చేసి చూపిస్తూ రెచ్చిపోయారు. ఇక విష్ణు ప్రియ ఇచ్చిన ఈ బోల్డ్ ఆన్సర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. విష్ణుప్రియ అంత బహిరంగంగా తన వ్యక్తిగత విషయాలను పంచుకోవడాన్ని కొందరు నెటిజన్లు తప్పపడుతున్నారు. ఇలాంటి విషయాలను లైవ్‌లో మాట్లాడటం ఏంటని నెటిజన్లు ఆమెపై దారుణంగా ట్రోల్స్ చేస్తున్నారు. విష్ణుప్రియ చేసిన ఈ కామెంట్స్ నెట్టింట హాట్ టాపిక్‌గా మారాయి.








# రాజకీయాల్లోకి రాబోతున్న మరో హీరో.. నా దృష్టంతా ప్రజాసేవపైనే పెడతానంటూ కామెంట్స్



కోలీవుడ్ ఇండస్ట్రీలో ఊహించని పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. తమిళ స్టార్ హీరో దళపతి విజయ్ రాజకీయాల్లోకి వచ్చి, ఎన్నికల్లో గెలిచి సీఎం అయిన తర్వాత తమిళ ఇండస్ట్రీలో పొలిటికల్ హీట్ బాగా పెరిగింది. స్టార్ హీరోలు ఓ వైపు వరుస సినిమాలు చేస్తూనే మరోవైపు రాజకీయాల్లోకి అడుగుపెడుతున్నారు. విజయ్ సాధించిన విజయం ఇచ్చిన స్ఫూర్తితో కోలీవుడ్ హీరోలు ఒక్కొరొక్కరిగా రాజకీయాల్లోకి వస్తున్నారు. ఇప్పటికే రాఘవ లారెన్స్ పొలిటికల్ ఎంట్రీపై క్లారిటీ ఇస్తూ ప్రకటన చేయగా.. ఎప్పుడనే విషయాన్ని మాత్రం సస్పెన్స్‌లో ఉంచారు. ఇక ఇప్పుడు మరో హీరో రాజకీయాల్లో రాబోతున్నట్లు హింట్ ఇచ్చాడు. నటుడిగా, మ్యూజిక్ డైరెక్టర్‌గా, ప్రొడ్యూసర్‌గా తెలుగు, తమిళ ఇండస్ట్రీలలో వరుస అవకాశాలతో దూసుకుపోతున్న జీవీ ప్రకాష్ కుమార్ చేసిన వ్యాఖ్యలు నెట్టింట చర్చకు దారితీస్తున్నాయి.

తన సినీ ప్రయాణం ఇంకొక పదిహేను, పదహారేళ్లు కొనసాగుతుందో లేదో తాను ఖచ్చితంగా చెప్పలేనని జీవీ ప్రకాష్ అన్నారు. కానీ, ఆ తర్వాత మాత్రం తన దృష్టిని పూర్తిగా ప్రజాసేవపైనే పెడతానని స్పష్టం చేశారు. సమాజంలో మార్పు కోసం, ప్రజలకు సేవ చేయడానికి భవిష్యత్తులో ఏదైనా చేస్తానని చెప్పారు. తన ఆలోచనలకు, ఆశయాలకు సరిపోయే ఒక మంచి వేదిక దొరికితే.. వారితో కలిసి పనిచేయడానికి తాను ఎప్పుడూ సిద్ధంగానే ఉంటానని తెలిపారు. ప్రస్తుతం ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా.. విజయ్ పార్టీలో చేరతారని అంతా చర్చించుకుంటున్నారు. కోలీవుడ్ ఇండస్ట్రీకి చెందిన హీరోలంతా సినిమాకంటే రాజకీయాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తుండటంపై నెటిజన్లు రకరకాల కామెంట్లు పెడుతున్నారు.

# మలయాళ ఇండస్ట్రీకి కరణ్ జోహార్ ఎంట్రీ.. గర్వంగా ఉందంటూ ఎమోషనల్ పోస్ట్



బాలీవుడ్ స్టార్ నిర్మాత కరణ్ జోహార్‌కు చెందిన ధర్మ ప్రొడక్షన్స్, మలయాళ స్టార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్‌కు చెందిన పృథ్వీరాజ్ ప్రొడక్షన్స్ కలిసి ఒక భారీ మలయాళ చిత్రాన్ని ప్రకటించాయి. 19వ శతాబ్దపు కేరళ జానపద కథలు, సాంస్కృతిక గాథల ఆధారంగా 'ఓడియన్: ది ఏజ్ ఆఫ్ ఇల్యూజన్' పేరుతో రాబోతుంది. తాజాగా, ఈ ప్రాజెక్ట్ గురించి కరణ్ జోహార్ సోషల్ మీడియాలో ఓ ఎమోషనల్ పోస్ట్ పెట్టారు. తాము ధర్మ ప్రొడక్షన్స్ తరపున మలయాళ ఇండస్ట్రీలోకి అడుగుపెడుతున్నందుకు చాలా గర్వంగా ఉందని తెలిపారు. పృథ్వీరాజ్ ప్రొడక్షన్స్‌తో తమకు ఇప్పటికే ఎన్నో విజయవంతమైన కొల్లాబరేషన్స్ ఉన్నాయని, భవిష్యత్తులో మరిన్ని ప్రాజెక్ట్స్ చేయబోతున్నామని చెప్పారు. ఈ తరం సినిమాలో జానపద కథలను ఎంతో భయంకరంగా, ఆసక్తికరంగా తెరకెక్కించడంలో దర్శకుడు రాహుల్ సదాశివన్‌కు ఒక ప్రత్యేకమైన శైలి ఉందని కరణ్ జోహార్ ప్రశంసించారు.

ఈ బలమైన జానపద ఇతిహాసాన్ని వెండితెరపై ఆవిష్కరించడానికి అద్భుతమైన నటి మంజు వారియర్, తమకు ఎంతో ఇష్టమైన పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారని, ఈ సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రాబోతుందని ఆయన వెల్లడించారు. అయితే ధర్మ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న మొట్టమొదటి మలయాళ చిత్రం ఇదే కావడం విశేషం. కేరళ పురాణాల్లోని రూపం మార్చుకునే ఓ మాయా శక్తి, ఒక బలమైన మాతృస్వామ్య కుటుంబంపై విరుచుకుపడటం.. ఆ తర్వాత సత్యం, భ్రమల మధ్య జరిగే భీకర పోరాటం చుట్టూ ఈ కథ సాగనుందని టాక్. కేరళ జానపద కథలను వెండితెరపై అద్భుతంగా ఆవిష్కరించే దర్శకుడు రాహుల్ సదాశివన్ ఈ సినిమాను అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తుండగా.. మంజు వారియర్,పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రధాన పాత్రలో కనిపించబోతున్నారు. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన షూటింగ్ కూడా ప్రారంభం కానుందని సమాచారం.

The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY editor BADHE JAYASHREE.

www.siridaily.com

RNI TG TEL/ 26/A0381

# సిరి

People's Voice వార్తపత్రిక

బుధవారం
17-06-2026

సంపుటి (Volume) : 2
సంచిక (Issue) 162

MEDAK, SANGAREDDY, SIDDIPET

పేజీలు : 5


## రోడ్డు పక్కన నిర్మాణాలకు నిబంధనలు పాటించాలి

- మున్సిపల్ కమిషనర్‌కు కౌన్సిలర్ శంకర్ గౌడ్ వినతి

4

రామాయంపేట, జూన్ 16 (సిరి న్యూస్) రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో, ప్రధాన రోడ్డు పక్కన కొత్తగా చేపడుతున్న వ్యాపార, నివాస గృహాల నిర్మాణాల్లో మున్సిపల్ నిబంధనలను కఠినంగా అమలు చేయాలని 8వ వార్డు కౌన్సిలర్ జంగంపల్లి శంకర్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం నాడు మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు.






# పార్కు స్థలంపై రాబంధుల కన్ను!

5



- ఇంద్రేశంలో పార్కు, వాటర్ ట్యాంక్ స్థలం దురాక్రమణ
- అంతా తెలిసినా..మున్సిపల్ అధికారుల మౌనం
- కబ్జాదారులకు నేతల అండదండలు
- కలెక్టరేట్ ముందు దీక్ష చేస్తామంటున్న మహదేవపురం కాలనీవాసులు

(నిఘా విభాగం-సిరి న్యూస్)

ఇంద్రేశం మున్సిపల్ పరిధిలోని మహాదేవపురం కాలనీలో ప్రజల అవసరాల కోసం కేటాయించిన పార్కు స్థలాన్ని కొందరు కబ్జాదారులు ఆక్రమించారు. ఆక్రమనకు గురైన ఈ స్థలం విలువ బహిరంగ మార్కెట్లో సుమారు రెండు కోట్ల రూపాయల వరకు ఉంటుందని అంచనా. పార్కుకు సరిహద్దులు వేసి కాలనీవాసులకు అందుబాటులో ఉంచాల్సిన స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులు తమ ఆధీనంలోకి తీసుకోవడంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతుంది ఈ విషయంలో కాలనీవాసులు మున్సిపల్ అధికారులకు, నాయకుల దగ్గరికి వెళ్లి మొర పెట్టుకున్నా ఫలితం లేకపోవడంతో ఏమి చేయలేని స్థితిలో ఉండిపోయారు.



# బెట్టింగ్ యాప్‌ల మరణ శాసనం!

- స్క్రీన్‌పై ఆట.. జీవితంతో జూదం
- ఈజీ మనీ మాయాజాలంతో చితికిపోతున్న కుటుంబాలు
- ఆస్తులు హారతి కర్పూరం.. అప్పులవాళ్ల వేధింపులు
- క్యాసినో గేమ్‌ల కోసం ఇతర రాష్ట్రాలు, దేశాలకు పయనం
- వినోదాల పేరుతో కోట్లు కొల్లగొడుతున్న బ్రోకర్లు
- నిషేధాలున్నా ఆగని దందా
- క్షణికావేశంలో బలవన్మరణాలు

2

క్షణాల్లో లక్షాధికారులు అయిపోవచ్చనే తప్పుడు ప్రకటనలు చూసి విద్యార్థులు, నిరుద్యోగ యువత, ఉద్యోగులు ఆన్‌లైన్ యాప్‌ల వైపు ఆకర్షితులవుతున్నారు. కేవలం వినోదం కోసం ప్రారంభించే ఆన్‌లైన్ గేమింగ్ (క్రికెట్ బెట్టింగ్, రమ్మీ, ఆన్‌లైన్ కాసినోలు) నెమ్మదిగా వ్యసనంగా మారుతోంది. బెట్టింగ్ రాయుళ్లు ఇళ్లు, పొలాలు, బంగారం తాకట్టు పెట్టి సర్వస్వం కోల్పోతున్నారు. మధ్యతరగతి, పేద కుటుంబాలు అప్పుల భారం తట్టుకోలేక వీధిన పడుతున్నాయి. అప్పులవాళ్ల వేధింపులు తట్టుకోలేక, పరువు పోతుందనే భయంతో అనేకమంది యువకులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు...

(బుచ్చిరెడ్డి జనార్ధన్‌రెడ్డి)
తూప్రాన్, జూన్ 15(సిరిన్యూస్)

# చెరువు పూడికతీత వివాదానికి తెర!

## డీపీఓ విచారణతో నిగ్గుతేలిన నిజం

- ఉద్దేశపూర్వక ఫిర్యాదులపై జిల్లా యంత్రాంగం సీరియస్
- హత్నూర గ్రామానికి స్వయంగా వచ్చి క్షేత్రస్థాయి విచారణ
- రెండు పక్షాల సమక్షంలో రికార్డులు, తీర్మాన పత్రాల పరిశీలన
- 90 శాతం మంది గ్రామ ప్రజల ఆమోదంతోనే పనులకు అనుమతి
- త్వరలోనే జిల్లా కలెక్టర్‌కు సమగ్ర రిపోర్ట్
- పనుల్లో పారదర్శకత ఉందాలంటున్న గ్రామస్తులు

4





# బెట్టింగ్ యాప్‌ల మరణ శాసనం!

- స్క్రీన్‌పై ఆట.. జీవితంతో జూదం
- ఈజీ మనీ మాయాజాలంతో చితికిపోతున్న కుటుంబాలు
- ఆస్తులు హారతి కర్పూరం.. అప్పులవాళ్ల వేధింపులు
- రోడ్డున పడుతున్న ఉన్నతస్థాయి వ్యక్తులు
- క్యాసినో గేమ్‌ల కోసం ఇతర రాష్ట్రాలు, దేశాలకు పయనం
- వినోదాల పేరుతో కోట్లు కొల్లగొడుతున్న బ్రోకర్లు
- నిషేధాలున్నా ఆగని దందా
- క్షణికావేశంలో బలవన్మరణాలు...
- అప్పుల ఊబి నుండి బయటపడలేక ఆత్మహత్యల విషాదం

**క్షణాల్లో లక్షాధికారులు అయిపోవచ్చనే తప్పుడు ప్రకటనలు చూసి విద్యార్థులు, నిరుద్యోగ యువత, ఉద్యోగులు ఆన్‌లైన్ యాప్‌ల వైపు ఆకర్షితులవుతున్నారు. కేవలం వినోదం కోసం ప్రారంభించే ఆన్‌లైన్ గేమింగ్ (క్రికెట్ బెట్టింగ్, రమ్మీ, ఆన్‌లైన్ కాసినోలు) నెమ్మదిగా వ్యసనంగా మారుతోంది. చేతిలో డబ్బులు అయిపోగానే స్నేహితుల వద్ద అప్పులు చేయడం, బైక్‌లు తాకట్టు పెట్టడం, క్రెడిట్ కార్డులు వాడటం చేస్తున్నారు. కొంతమంది యువకులు బెట్టింగ్ కోసం దొంగతనాలు, చైన్ స్నాచింగ్స్, సైబర్ మోసాలకు కూడా పాల్పడుతున్నారు. బెట్టింగ్ రాయుళ్లు ఇళ్లు, పొలాలు, బంగారం తాకట్టు పెట్టి సర్వస్వం కోల్పోతున్నారు. మధ్యతరగతి, పేద కుటుంబాలు అప్పుల భారం తట్టుకోలేక వీధిన పడుతున్నాయి. భర్త లేదా కొడుకు బెట్టింగ్ వ్యసనం వల్ల ఇంట్లో గొడవలు జరిగి, విడాకులు, కుటుంబాలు విచ్ఛిన్నం అవుతున్న కేసులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. అప్పులవాళ్ల వేధింపులు తట్టుకోలేక, పరువు పోతుందనే భయంతో అనేకమంది యువకులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు...**

(బుచ్చిరెడ్డి జనార్ధన్‌రెడ్డి)
తూప్రాన్, జూన్ 15(సిరిన్యూస్)

సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో ఆన్‌లైన్ బెట్టింగ్‌ల బారిన పడుతున్న యువత చివరికి అప్పుల ఊబిలో జీవితాలు చిక్కుకుంటున్నాయి. మొదట్లో వెయ్యికి 5 వేల నుండి 10 వేల లాభాలు చూపించి బెట్టింగ్ గేమ్ మాఫియా ఆశలు చూపెడతాయి. ఆ తర్వాత లక్షల రూపాయలు కోల్పోయేలా చేస్తున్నాయి. దీంతో యువతతో పాటు వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఫోన్ చేతిలో ఉంటే క్షణాల్లో బెట్టింగ్‌లు పెట్టి ఆన్‌లైన్ లో యువతను ఆకర్షిస్తున్నాయి. క్రికెట్ మ్యాచ్‌లు, క్యాసినో గేమ్స్, ఇతర ఆన్‌లైన్ గేమింగ్ పేర్లతో నిర్వహిస్తున్న ఈ ఫారమ్‌ల భారీ లాభాల ఆశ చూపిస్తున్నాయి. అయితే మొదట చిన్న మొత్తాల్లో గెలుపులు చూపించి నమ్మకం కల్పించి తర్వాత పెద్ద మొత్తాలను పెట్టుబడిగా పెట్టించేలా ప్రలోభాలకు గురిచేస్తున్నాయి.




పోలీసులకు సవాలుగా మారిన వైనం..

తెలంగాణ గేమింగ్ చట్టం ప్రకారం రాష్ట్రంలో ఆన్‌లైన్ బెట్టింగ్, జూదం పూర్తిగా నిషేధించబడ్డాయి. ఈ యాప్‌ల సర్వర్లు విదేశాల (ముఖ్యంగా చైనా, మాల్టా) నుండి నడుస్తుండటం, వర్చువల్ ప్రైవేట్ నెట్‌వర్క్, క్రిప్టో కరెన్సీల ద్వారా లావాదేవీలు జరగడం వల్ల పోలీసులకు వీటిని పూర్తిగా అడ్డుకోవడం సవాలుగా మారింది. సైబర్ క్రైమ్ పోలీసులు ఇల్లీగల్ బెట్టింగ్ అకౌంట్లను, హవాలా లింకులను గుర్తించి బ్యాంకు ఖాతాలను సీజ్ చేస్తున్నారు. ఆన్ లైన్ బెట్టింగుల నుండి కాపాడడానికి తల్లిదండ్రుల పాత్ర ఎంతో ముఖ్యం. పిల్లల బ్యాంక్ అకౌంట్ ట్రాన్సాక్షన్స్, డిజిటల్ వాలెట్స్ పై నిరంతరం నిఘా ఉంచాలి. వారు మొబైల్‌లో ఏం చూస్తున్నారో గమనించాలి. బెట్టింగ్‌కు బానిసైన వారికి సైకియాట్రిస్ట్‌ల ద్వారా తక్షణమే డీఅడిక్షన్ కౌన్సిలింగ్ ఇప్పించాలి. కళాశాలలు, పాఠశాలల్లో ఆన్‌లైన్ జూదం వల్ల జరిగే నష్టాలపై సైబర్ నిపుణులతో అవగాహన సదస్సులు నిర్వహించాలి.



## అప్రమత్తంగా ఉండాలి

ఆన్ లైన్ గేమ్స్ అనేది చిన్న పెద్ద తేడా లేకుండా పోయింది. వినోదాల కోసమని ఫోన్లో ఇంటర్నెట్ ఆన్ చేయడంతో ఏవో లింకులు రాగానే వాటిని ఓపెన్ చేయడం తద్వారా ఆటలకు లోనవ్వడం ఇంటర్నెట్లో వారు సూపించే ఆకర్షణకు లోనై లక్షల్లో డబ్బు పోగొట్టుకుంటున్నారు. ఇంటర్నెట్ గేమ్ల పట్ల జాగ్రత్త వహించాలి. ఇంటర్నెట్ గేమ్స్ బ్యాండ్ చేసినప్పటికీ ఏదో ఒకరకంగా గేములు కొనసాగుతున్నాయి. డబ్బులు సమయానికి దొరకకపోవడంతో దొంగతనాలకు నేరాలకు పాల్పడుతున్నారు. ఇలాంటి వాటికి బానిసలు కాకుండా అప్రమత్తంగా ఉండాలి.

**నరేందర్‌గౌడ్, డీఎస్పీ, తూప్రాన్**



# ఏఈఈ 'నకిలీ' సామ్రాజ్యం!


## దొంగ బ్యాంకు ఖాతాలు, ఫోర్జరీ పత్రాలతో రూ.3.40 కోట్ల బిల్లుల మళ్లింపు

- దొంగ బ్యాంక్ ఖాతాలు, ఫోర్జరీ పత్రాలతో స్వాహా
- నిజాంపేట్ మున్సిపల్ పరిధిలో అసిస్టెంట్ ఇంజనీర్ లీలలు
- వెలుగుచూసిన భారీ అవినీతి స్కామ్
- కష్టపడి పనిచేసిన సివిల్ కాంట్రాక్టర్‌ను నిలువునా ముంచేసిన నాటి ఏఈఈ
- డంప్ యార్డ్ చెత్త తరలింపు పనుల బిల్లుల్లో మోసం
- కాంట్రాక్టర్‌కు తెలియకుండానే నకిలీ సంస్థ సృష్టి
- విజిలెన్స్ క్లియరెన్స్ పేరుతో అసలైన బిల్లులు పెండింగ్
- సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్‌కు ఆధారాలతో ఫిర్యాదు చేసిన బాధితుడు

టై కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ, ఎంవంసీ, సీఎంసీ) పరిధిలో ఏసీబీ అధికారులు వరుస దాడులు చేస్తూ అవినీతి తిమింగలాల వేట సాగిస్తున్నా, కొందరు అధికారుల లంచాల బాగోతం, అక్రమ సంపాదన దాహం మాత్రం అస్సలు ఆగడం లేదు. నాటి నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గా పనిచేసిన ఒక అధికారి ప్రభుత్వ నిబంధనలను, నైతిక విలువలను పూర్తిగా గాలి కొదిలేసి సాగించిన అక్రమాల పర్వం ఇప్పుడు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో తీవ్ర కలకలం రేపుతోంది. క్షేత్రస్థాయిలో అహోరాత్రులు కష్టపడి పనిచేసిన ఒక సివిల్ కాంట్రాక్టర్ రక్తాన్ని పిండి, అతడికి రావాల్సిన రూ.3.40 కోట్ల భారీ బిల్లులను సదరు ఇంజనీర్ దొంగ బ్యాంక్ ఖాతాలు, ఫోర్జరీ పత్రాల ద్వారా తన సొంత కుటుంబ సభ్యుల ఖాతాల్లోకి మళ్లించుకున్న నయా దగా ఉదంతం బయటపడింది. దీనిపై బాధితుడు ఆధారాలతో సహా సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయడంతో ఈ అక్రమ సామ్రాజ్యం బట్టబయలైంది.

(ప్రత్యేక ప్రతినిధి, సిరి న్యూస్)




Account Name: JMC CONSTRUCTIONS
Hdfc Bank Current Account No: 50200097789660
Company Customer id: 290617597
B Ganga Bhavani Customer id: 290617598
B L Narayana Reddy Customer id: 290617599
Ifsc code:HDFC0000472
Swift Code:HDFCINBB
Branch: RTC X ROAD



### అధికార బలంతో చక్రం..

బాధిత కాంట్రాక్టర్ తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఏఈఈ (ప్రస్తుతం డీఈ శానిటేషన్ హోదా) గా ఉన్న సదరు అధికారి ధీరజ్ కుమార్ తన అధికార బలంతో సివిల్ కాంట్రాక్టర్‌ను టార్గెట్ చేశారు. నిజాంపేట్ డంప్ యార్డ్ నుండి జవహర్ నగర్ డంప్ యార్డ్‌కు చెత్తను తరలించే భారీ ప్రక్రియలో అనధికారిక భాగస్వామ్యం కోసం ఒత్తిడి తెచ్చారు. ఎంబీ రికార్డులు నమోదు చేసే అధికారం ఇంజనీర్‌దే కావడంతో విధిలేని పరిస్థితుల్లో జేఎంసీ కన్స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ తరపున సబ్ కాంట్రాక్టర్ రంగంలోకి దిగారు. ఆగస్టు 2023 నుండి జనవరి 2025 వరకు జేసీబీలు, పొక్లెయిన్లు, టిప్పర్లు, లేబర్, డీజిల్ ఖర్చుల నిమిత్తం సొంత నిధులతో పాటు భారీగా అప్పులు తెచ్చి కోట్ల రూపాయలు పెట్టుబడిగా పెట్టి పనులను విజయవంతంగా పూర్తి చేశారు. మొత్తం 11 ఫైళ్లకు గానూ 9 బిల్లులను నిబంధనల ప్రకారం అకౌంట్స్ సెక్షన్‌కు సమర్పించగా, అక్కడే ఏఈఈ తన కుట్రకు తెరలేపారు.

### సొంత చెల్లెలు, బావ, తండ్రే బినామీలు..

కాంట్రాక్టర్‌కు రావాల్సిన కోట్లాది రూపాయల ఆదాయాన్ని తానే దక్కించుకోవాలనే దురాశతో సదరు అధికారి నేరానికి పాల్పడ్డారు. కాంట్రాక్టర్‌కు కనీస సమాచారం లేకుండానే 'జేఎంసీ కన్స్ట్రక్షన్' (ప్రొప్రైటరీషిప్ నకిలీ సంస్థ) పేరుతో ఫోర్జరీ డాక్యుమెంట్లు, నకిలీ జీఎస్టీ, ప్యాన్ కార్డ్‌లను సృష్టించి ఒక దొంగ బ్యాంక్ ఖాతాను తెరిచారు. ఈ నకిలీ సంస్థకు కడప జిల్లాకు చెందిన తన సొంత సోదరి, ఆమె భర్త (బావ)లను యజమానులుగా చూపించారు. అంతేకాకుండా, ఈ దొంగ ఖాతాకు సదరు ఇంజనీర్ తండ్రిని అధికారిక సంతకం దారుడిగా నియమించి, మున్సిపాలిటీ నుంచి విడుదలైన చెక్కులను అక్రమంగా డ్రా చేసుకున్నారు. క్షేత్రస్థాయిలో చెమటోడ్చిన సబ్ కాంట్రాక్టర్‌కు 'విజిలెన్స్ క్లియరెన్స్' పేరుతో బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని ఏడాది కాలంగా నమ్మిస్తూ కాలయాపన చేశారు. తీరా బాధితుడు అనుమానంతో ఆరా తీయగా, నకిలీ సంస్థ పేరిట బిల్లులన్నీ డ్రా అయినట్లు తేలడంతో నిర్ఘాంతపోయారు.








### కమిషనర్‌ను ఆశ్రయించిన బాధితుడు..

ఈ భారీ ఆర్థిక మోసంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేసిన బాధిత కాంట్రాక్టర్, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్‌ను కలిసి లిఖితపూర్వక ఫిర్యాదు సమర్పించారు. ఈ అక్రమాలా మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నతాధికారులకు ఎటువంటి సంబంధం లేదని, లోపమంతా సదరు ఇంజనీర్, ఆయన కుటుంబ సభ్యులదేనని స్పష్టం చేశారు. తప్పుడు మార్గాల్లో తప్పుడు పత్రాలు సృష్టించి తనను ఆర్థికంగా దెబ్బతీసి, నడిరోడ్డుపై నిలబెట్టిన సదరు అధికారిపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. నకిలీ బ్యాంక్ ఖాతాలు, ఫోర్జరీ జీఎస్టీ రికార్డులను వెలికితీయాలని, క్షేత్రస్థాయి యంత్రాల వినియోగం, లేబర్ రికార్డుల ఆధారంగా తానే అసలైన ఎగ్జిక్యూటర్ అని తేల్చి తనకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతూ, కాంట్రాక్టర్ల పొట్టగొడుతున్న ఈ ఇంజనీరింగ్ అవినీతి భాగోతంపై ఉన్నతాధికారులు, ప్రభుత్వం ఏ విధంగా స్పందిస్తాయో వేచి చూడాలి.



# చెరువు పూడికతీత వివాదానికి తెర!

## డీపీఓ విచారణతో నిగ్గుతేలిన నిజం

- ఉద్దేశపూర్వక ఫిర్యాదులపై జిల్లా యంత్రాంగం సీరియస్
- హత్నూర గ్రామానికి స్వయంగా వచ్చి క్షేత్రస్థాయి విచారణ
- రెండు పక్షాల సమక్షంలో రికార్డులు, తీర్మాన పత్రాల పరిశీలన
- 90 శాతం మంది గ్రామప్రజల ఆమోదంతోనే పనులకు అనుమతి
- త్వరలోనే జిల్లా కలెక్టర్‌కు సమగ్ర రిపోర్ట్
- పనుల్లో పారదర్శకత ఉండాలంటున్న గ్రామస్తులు



**హత్నూర, జూన్ 16 (సిరి న్యూస్):** హత్నూర గ్రామ పరిధిలోని అల్వ చెరువు పూడికతీత పనుల చుట్టూ గత కొద్దిరోజులుగా నడుస్తున్న వివాదానికి ఎట్టకేలకు తెరపడింది. ఈ పనులకు సంబంధించి గ్రామంలో ఎలాంటి గ్రామసభ నిర్వహించలేదని, ప్రజల సమక్షంలో తీర్మానం కూడా చేయకుండానే పనులు తలపెట్టారని కొందరు స్థానికులు జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులపై జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) మల్లారెడ్డి మంగళవారం హత్నూర గ్రామంలో స్వయంగా పర్యటించి, క్షేత్రస్థాయిలో ముమ్మర విచారణ చేపట్టారు. విచారణ సందర్భంగా డీపీఓ మల్లారెడ్డి పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఫిర్యాదుదారులతో పాటు గ్రామ పెద్దలను, వార్డు సభ్యులను, సాధారణ ప్రజలను, సంబంధిత అధికారులను పిలిపించి వివరాలు సేకరించారు. గ్రామంలో గతంలో జరిగిన జనరల్ బాడీ సమావేశ రికార్డులను, గ్రామసభ మినిట్స్ బుక్‌ను, తీర్మాన పత్రాలపై ఉన్న సంతకాలను సాక్ష్యాధారాలతో సహా డీపీఓ క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

### పారదర్శకంగా పనులు..

ఇరిగేషన్ శాఖ అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన జరిపి, చెరువులో ఉన్న మట్టి, పూడిక స్థాయిపై సమర్పించిన సాంకేతిక నివేదిక ఆధారంగానే ఈ కార్యక్రమం కొనసాగుతదని, ఇందులో ఎలాంటి నిబంధనల ఉల్లంఘన జరగలేదని ఆయన స్పష్టం చేశారు. ఈ విచారణకు సంబంధించిన పూర్తి వివరాలు, రికార్డుల నకళ్లు, గ్రామస్థుల వాంగ్మూలాలతో కూడిన సమగ్ర నివేదికను బుధవారం జిల్లా కలెక్టర్‌కు అందజేయనున్నట్లు డీపీఓ మల్లారెడ్డి తెలిపారు. కాగా, పూడికతీత పనులు పారదర్శకంగా చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### నిగ్గుతేలిన నిజం.. 90 శాతం మంది మద్దతు

సమగ్ర రికార్డుల పరిశీలన అనంతరం డీపీఓ మల్లారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ.. చెరువు పూడికతీతపై గ్రామంలో చట్టప్రకారమే గ్రామసభ నిర్వహించబడినట్లు స్పష్టమైన ఆధారాలు ఉన్నాయని వెల్లడించారు. మెజార్టీ గ్రామ వార్డు సభ్యులతో పాటు దాదాపు 90 శాతం మంది గ్రామ ప్రజలు ఈ గ్రామసభ తీర్మానానికి పూర్తిస్థాయిలో మద్దతు తెలుపుతూ సంతకాలు చేసినట్లు రికార్డుల ద్వారా నిరూపితమైందని స్పష్టం చేశారు. విచారణ జరుగుతున్న సమయంలో క్షేత్రస్థాయిలో గ్రామస్థులను ప్రశ్నించగా, గ్రామసభలో తీర్మానం చేసిన మాట నూటికి నూరుపాళ్లు వాస్తవమేనని వారు అధికారుల ముందే బహిరంగంగా అంగీకరించారు. కొందరు వ్యక్తులు వ్యక్తిగత, రాజకీయ కారణాలతోనే పనులను అడ్డుకోవాలనే దురుద్దేశంతో తప్పుడు ఫిర్యాదులు చేశారని విచారణలో తేలింది.

# రోడ్డు పక్కన నిర్మాణాలకు నిబంధనలు పాటించాలి

- మున్సిపల్ కమిషనర్‌కు కౌన్సిలర్ శంకర్ గౌడ్ వినతి

**రామాయంపేట, జూన్ 16 (సిరి న్యూస్)** రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో, ప్రధాన రోడ్డు పక్కన కొత్తగా చేపడుతున్న వ్యాపార, నివాస గృహాల నిర్మాణాల్లో మున్సిపల్ నిబంధనలను కఠినంగా అమలు చేయాలని 8వ వార్డు కౌన్సిలర్ జంగంపల్లి శంకర్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం నాడు మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ శంకర్ గౌడ్ మాట్లాడుతూ.. రామాయంపేట మున్సిపల్ పరిధిలోని ప్రధాన రహదారి అయిన మెదక్ రోడ్ బైపాస్ బ్రిడ్జి నుండి సిద్దిపేట వైపు వెళ్లే రోడ్డు, దౌల్తాబాద్ చౌరస్తా సర్కిల్ వరకు సుమారు 3 కిలో మీటర్ల మేర రోడ్డుకు ఇరువైపులా ప్రస్తుతం అనేక కొత్త వ్యాపార భవనాలు, నివాస గృహాల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. అయితే, ఈ నిర్మాణాలన్నీ ప్రధాన రహదారి మధ్య భాగం నుండి ఖచ్చితమైన సెట్ బ్యాక్ (నిర్ణీత స్థలం)వదిలి, మున్సిపల్ అనుమతులకు అనుగుణంగానే జరిగేలా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు.ప్రస్తుతం ఈ ప్రాంతంలో రోడ్డు వెడల్పు చాలా తక్కువగా ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రోజు రోజుకూ జనాభాతో పాటు వాహనాల రాకపోకలు విపరీతంగా పెరగడం వల్ల ఇక్కడ ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. భవిష్యత్తులో రోడ్డు విస్తరణ చేపట్టాల్సి వస్తే ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలంటే, ఇప్పటి నుంచే నిర్మాణ నిబంధనలను పక్కాగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్తులో ప్రజల రోడ్డు వినియోగాన్ని, ట్రాఫిక్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని మాత్రమే అధికారులు నిర్మాణ అనుమతులు ఇవ్వాలని, ఈ విషయంలో ఎలాంటి అలసత్వం వహించకుండా, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు.





# పార్కు స్థలంపై రాబంధుల కన్ను!



- ఇంద్రేశంలో పార్కు, వాటర్ ట్యాంక్ స్థలం దురాక్రమణ
- అంతా తెలిసినా..మున్సిపల్ అధికారుల మౌనం
- కబ్జాదారులకు నేతల అండదండలు
- కలెక్టరేట్ ముందు దీక్ష చేస్తామంటున్న మహదేవపురం కాలనీవాసులు

ఇంద్రేశం మున్సిపల్ పరిధిలోని మహాదేవపురం కాలనీలో ప్రజల అవసరాల కోసం కేటాయించిన పార్కు స్థలాన్ని కొందరు కబ్జాదారులు ఆక్రమించారు. ఆక్రమనకు గురైన ఈ స్థలం విలువ బహిరంగ మార్కెట్లో సుమారు రెండు కోట్ల రూపాయల వరకు ఉంటుందని అంచనా. పార్కుకు సరిహద్దులు వేసి కాలనీవాసులకు అందుబాటులో ఉంచాల్సిన స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులు తమ ఆధీనంలోకి తీసుకోవడంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతుంది ఈ విషయంలో కాలనీవాసులు మున్సిపల్ అధికారులకు, నాయకుల దగ్గరికి వెళ్లి మొర పెట్టుకున్నా ఫలితం లేకపోవడంతో ఏమి చేయలేని స్థితిలో ఉండిపోయారు. (నిఘా విభాగం-సిరి న్యూస్)

### కళ్ళముందే పార్కు, ట్యాంకు సలం కబ్జా..

కళ్ళముందే మేము ఎంతో ఆశగా దాచుకున్న పార్కు, వాటర్ ట్యాంక్ స్థలం కబ్జాదారుల పాలవుతుంటే గుండె తరుక్కుపోతుందని కాలనీలోని వృద్ధులు, మహిళలు కన్నీరు మున్నీరయ్యారు. పార్కు రూపంలో మాకున్న కాస్త ప్రశాంతతను కూడా లాగేసుకున్నారని వాపోయారు. రోజంతా కష్టపడి సాయంత్రం వేళల్లో కాసేపు వచ్చి కూర్చుని మనశ్శాంతిని పొందే ఏకైక ఆసరా ఈ పార్కు స్థలమేనని, ఇప్పుడు దాన్ని కూడా మట్టి పోసి అక్రమంగా పూర్తి చేస్తుంటే దిక్కుతోచని స్థితిలో ఉన్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. వీధుల్లో ఆడుకుంటూ ఇళ్ళ ముందు వెళ్లే వాహనాల కింద పడకుండా సురక్షితంగా ఆడుకోవడానికి పిల్లలకు ఉన్న ఒకే ఒక ఆట స్థలాన్ని భూస్వామ్య శక్తులు మింగేస్తున్నాయని ఆరోపించారు. కాలనీ పెరిగే కొద్దీ భవిష్యత్తులో తాగునీటి అవసరాల కోసం ఉపయోగపడుతుందని కేటాయించుకున్న 600 గజాల వాటర్ ట్యాంక్ స్థలాన్ని కూడా రాత్రికి రాత్రే కబ్జా చేయడంపై కాలనీవాసులు తీవ్రంగా విమర్శిస్తున్నారు.

### అధికారుల మౌనం.. కబ్జాదారులకు బలం...

మున్సిపల్ అధికారులు రెండు కోట్ల పార్కు స్థలం కబ్జా అవుతుంటే ఏం చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. కళ్ళ ముందే ఇంత అన్యాయం జరుగుతున్నా ఎవరూ స్పందించకపోవడం వెనుక పెద్దల హస్తం ఉందని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మా పిల్లల నవ్వులను, వృద్ధుల ప్రశాంతతను బలిపెట్టే ఈ అక్రమ కబ్జాను ప్రాణం పోయినా సహించమని కాలనీవాసులు స్పష్టం చేస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి న్యాయం చేయకపోతే కలెక్టరేట్ ముందు కాలనీవాసులమంతా కలసి నిరాహారదీక్షకు దిగుతామని హెచ్చరించారు.







